PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 63 | విజయవాడ, మంగళవారం 3 అక్టోబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Tuesday 3 October 2023 | Rs

6 దశల్లో వెరిఫికేషన్

- పది, ఇంటర్ విద్యార్థులకు రెవెన్యూశాఖ నుంచి ఇన్‌కమ్ సర్టిఫికెట్ల జారీ

2



6

స్టీపుల్‌ఛేజ్, లాంగ్ జంప్‌లో రజతాలు

- భారత్ ఖాతాలో మరో ఏడు పతకాలు
- 60పతకాలతో నాల్గో స్థానంలోనే..

వైద్య రంగంలో ఇద్దరికి నోబెల్

కోవిడ్ వ్యాక్సిన్ల పరిశోధనలకే !



కాటలిన్ కరికో



డ్రూ వెయిస్‌మన్

న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మకమైన నోబెల్ బహుమతిని ఈ ఏడాది వైద్యశాస్త్ర విభాగంలో ఇద్దరికి ప్రకటించారు. ప్రపంచాన్ని గజగజ వణికించిన కరోనా మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎంఆర్‌ఎన్‌ఎ వ్యాక్సిన్ల అభివృద్ధిలో కీలక పరిశోధనలు చేసిన కటాలిన్ కరికో, డ్రూ వెయిస్‌మన్‌లకు ఈ పురస్కారం లభించింది. న్యూక్లియోసైడ్ బేస్ మాడిఫికేషన్లకు సంబంధించిన ఆవిష్కరణల ప్రాతిపదికగా ఎంఆర్‌ఎన్‌ఎ వ్యాక్సిన్ల అభివృద్ధికి వీరు చేసిన ఆవిష్కరణలు దోహదపడ్డాయని, వీరి కృషి అద్వితీయమని నోబెల్ అకాడెమీ జ్యూరీ తెలిపింది.

1990వ దశకం ప్రారంభంలోనే బయో కెమిస్ట్ అయిన కటాలిన్ కరికో, ఎంఆర్‌ఎన్‌ఎ ప్రాధాన్యతను గుర్తించారు. ఆ తర్వాత ఆమె, ఆమె కొలీగ్, ఇమ్యూనాలజిస్ట్ అయిన డ్రూ వెయిస్‌మన్ పరిశోధనాంశాలతో 2005లో ఒక పత్రాన్ని ప్రచురించారు. న్యూక్లియోసైడ్ మాడిఫికేషన్ ప్రభావాన్ని, రోగ నిరోధక వ్యవస్థపై అది కనబరిచే ప్రభావాన్ని ఆ పత్రంలో రూపొందించారు. ఆ తర్వాత 2008, 2010ల్లో కూడా పరిశోధనా పత్రాలు ప్రచురించారు. అవన్నీ కలిసి కోవిడ్ సమయంలో ఎంఆర్‌ఎన్‌ఎ వ్యాక్సిన్ల అభివృద్ధికి దోహదపడ్డాయి.

హంగరీకి చెందిన కరికో సాగన్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, పెన్సిల్వేనియా యూనివర్సిటీలో అనుబంధ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె 2022 వరకూ బయాన్‌టెక్ ఆర్‌ఎన్‌ఎ ఫార్మస్యూటికల్స్‌లో మిగతా 5లో

గాంధీజీకి ఘన నివాళి

న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోడీ తదితర ప్రభృతులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం ఢిల్లీలో రాజ్‌ఘాట్‌లోని గాంధీజీ సమాధిని సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్రమోడీ తదితరులు పుష్ప గుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాజ్‌ఘాట్‌లో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. 'గాంధీజీ సిద్ధాంతాలు కేవలం ఆలోచనల్లో నుంచి వచ్చినవి కావని, అవి అనుభవంలో రాటుదేలిన సత్యాలు అని రాష్ట్రపతి కొనియాడారు. జీవితానికి ఉపయోగపడని తత్వం ఏదైనా 'ధూళి లాంటిదేనని ఆమె అన్నారు. గాంధీజీ ఏం చెప్పేవారో అది ఆచరించి చూపేవారని ఆమె ట్వీట్ చేశారు. గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముడికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని, . ఆయన బోధనలు మన మార్గాన్ని ఎల్లప్పుడూ ప్రకాశింపజేస్తూనే ఉంటాయని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి కూడా అక్టోబరు2నే కావడంతో విజయ్‌ఘాట్‌ను సందర్శించి, ప్రధాని నివాళులర్పించారు. ఆయన ఇచ్చిన 'జై జవాన్, జై కిసాన్' పిలుపు నేటికీ ప్రతిధ్వనిస్తోందని ప్రధాని పేర్కొన్నారు. గాంధీజీ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నివాళులర్పించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని సహమత్ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, పత్రికా రిపోర్టుల ప్రదర్శన మనసుకు హత్తుకునేలా ఉందని పేర్కొన్నారు. గాంధీజికి సంబంధించి శుభాముద్గల్ సంగీత కచేరి, కవితాగానం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని సామాజిక మాధ్యమాల్లో ఏచూరి పేర్కొన్నారు.



గాంధీజీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము



దీక్ష నిర్వహిస్తున్న భువనేశ్వరి తదితరులు

నా దీక్ష ప్రజల కోసమే...

- రాజమండ్రిలో నారా భువనేశ్వరి
- సెంట్రల్ జైలులో చంద్రబాబు ఒక్క రోజు నిరశన

ప్రజాశక్తి– రాజమహేంద్రవరం ప్రతినిధి

తన దీక్ష చంద్రబాబు కోసమో, తన కుటుంబం కోసమో కాదని, రాష్ట్ర ప్రజల కోసమని నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు అరెస్ట్‌పై 'సత్యమేవ జయతే' పేరుతో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని క్వారీ సెంటర్ వద్ద సోమవారం ఆమె ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఇదే సమయంలో సెంట్రల్ జైలులో చంద్రబాబు ఒక్కరోజు నిరశన దీక్షకు దిగారు. ఆయన ఆరోగ్య పరిస్థితుల రీత్యా వైద్య బృందాన్ని జైలు అధికారులు అందుబాటులో ఉంచినట్లు సమాచారం. భువనేశ్వరి తొలుత గాంధీ విగ్రహానికి, ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.10 గంటలకు వరకు దీక్ష కొనసాగించారు. సాయంత్రం 5.19 గంటలకు చిన్నారుల చేతుల మీదుగా నిమ్మరసం తీసుకుని దీక్ష విరమించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, జనసేన పార్టీ మహిళా నేతలు, టిడిపి మహిళా నేతలు భువనేశ్వరికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా తాను దీక్ష చేశానన్నారు. తన తండ్రి, తన భర్త అధికారాన్ని ఎప్పుడూ దుర్వినియోగం చేయలేదని పేర్కొన్నారు. అధికారంతో తమకు పనిలేదని, తమపని తాము చేసుకుంటూ వెళ్తామని అన్నారు. తమ కుటుంబానికి ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎన్నడూ అనుకోలేదన్నారు. తామందరినీ అరెస్టు చేసినా కార్యకర్తలు టిడిపిని నడిపిస్తారన్నారు.

చంద్రబాబు అరెస్టుతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శిస్తా

చంద్రబాబు అరెస్టు వల్ల 105 మంది మృతి చెందారని, ఆ కుటుంబాలను తాను స్వయంగా పరామర్శిస్తానని భువనేశ్వరి తెలిపారు. 'నిజం గెలవాలి' అనే స్లోగన్‌తో ప్రజలు కలిసి రావాలని కోరారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు వనజ మాట్లాడుతూ భువనేశ్వరి పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి, మహిళా కమిషన్ మాజీ చైర్మన్ నన్నపనేని రాజకుమారి, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనిత, మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి
ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

సిపిఎం రాష్ట్ర సదస్సులో వి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి– అనంతపురం ప్రతినిధి

వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మాటను బిజెపి ప్రభుత్వం తప్పిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఇప్పటికైనా విభజన చట్టంలో పేర్కొన్న ఏడు జిల్లాలతోపాటు వెనుకబడిన ప్రకాశం జిల్లాకూ ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధి అనే అంశంపై అనంతపురంలోని లలిత కళా పరిషత్ హాలులో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. సదస్సు ప్రారంభానికి ముందు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామని 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు తిరుపతిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారన్నారు. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్‌లోనూ నాటి ప్రధాని కొన్ని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, పదేళ్లు కాబోతున్నా ఏ ఒక్క హామీనీ బిజెపి సర్కార్ అమలు చేయలేదని విమర్శించారు. వెనుకబడిన ప్రాంతాలకు ఇస్తామన్న ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. ఏడాదికి జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున మూడు సంవత్సరాలు కేటాయించి తరువాత వెనక్కు తీసుకున్నారని విమర్శించారు. నిత్యం రాముడు పేరు జపించే బిజెపి... రాముడిలాగా మాట నిలుపుకోలేదన్నారు. ఆయన తండ్రికిచ్చిన మాట కోసం అరణ్యం వెళ్లారని గుర్తు చేశారు. ఈ పేరు చెప్పుకునే బిజెపి మాత్రం వంద అబద్ధాలైనా ఆడుతుందే తప్ప, ఇచ్చిన మాట నిలుపుకోదని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించలేని స్థితిలో రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి ఉన్నాయన్నారు. రాయలసీమ ప్రాంతం ఇప్పటికీ అత్యంత దుర్భిక్ష ప్రాంతంగానే ఉందన్నారు. సాగు, తాగునీటి వనరుల్లేక ఇక్కడి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 1984లో చేపట్టిన తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులు ఇప్పటికీ మిగతా 2లో



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

తెలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఎ దాడులు

- ఎపిలో 53, తెలంగాణలో 9 ప్రాంతాల్లో సోదాలు
- సత్యసాయి జిల్లాలో ఒకరు అరెస్టు, పిస్తోలు స్వాధీనం



కూటగుళ్లలో చంద్ర నరసింహులు ఇంట్లో ఎన్ఐఎ అధికారుల సోదాలు

ప్రజాశక్తి– యంత్రాంగం

తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల సోమవారం కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సోదాలు నిర్వహించింది. 2020 నవంబర్ 23న అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్‌లో జరిగిన మావోయిస్టు కుట్ర కేసులో సంబంధం ఉందనే, గతంలో మావోయిస్టుల కదలికలు తీవ్రంగా ఉన్న రోజుల్లో వారితో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలపై సోదాలు జరిపారు. పలువురి ఇళ్లలో కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పౌరహక్కుల నేతలు, అమరబంధు మిత్రుల సంఘం, చైతన్య మహిళా సంఘం, కులనిర్మూలన పోరాట సమితి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య తదితర సంఘాల నాయకుల ఇళ్లలో ఎన్ఐఎ అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. వారిలో పలువురికి సిఆర్‌పిసి 160 కింద నోటీసు జారీ చేశారు. కొందరిని ఈ నెల పదిన, మరికొందరిని ఈ నెల 19, ఇంకొందరిని ఈ నెల 24, పలువురిని ఈ నెల 31న హైదరాబాద్ ఎన్ఐఎ ఆఫీసులో హాజరు కావాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 62 ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 53 ప్రాంతాల్లోనూ, తెలంగాణలోని తొమ్మిది ప్రాంతాల్లోనూ సోదాలు జరిగాయి. ఈ దాడుల్లో నేపథ్యంలో చుట్టుపక్కల వారు భయభ్రాంతాలకు గురయ్యారు.

శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణం సమీపంలోని కూటగుళ్లలో ఉంటున్న చంద్ర నరసింహులును అరెస్టు చేశాయని, ఆయన ఇంట్లో ఒక పిస్తోలు, 14 రౌండ్ల తూటాలు స్వాధీనం చేసుకున్నాయని ఎన్ఐఎ అధికారులు తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా పొద్దుటూరులో ఓ విలేకరి (ప్రజాశక్తి కాదు) ఇంట్లో రూ.13 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విలేకరి భార్య నాగమణిని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎన్ఐఎ అధికారులు విచారించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సమాజం బాగు, సమాజ సంక్షేమం గురించి మాట్లాడడం నేరమా? ఎన్ఐఎ అధికారులను ప్రశ్నించారు.

సిపిఎం ఖండన

వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల ఇళ్లపై ఎన్ఐఎ అధికారులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మూకుమ్మడి దాడులు చేయడాన్ని సిపిఎం ఖండించింది. ఈ దాడులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇలాంటి దాడులను తక్షణం ఆపాలని కోరారు. తెలంగాణలో దాడులను తెలంగాణ పౌరహక్కుల సంఘం నేతలు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నారాయణరావు తీవ్రంగా ఖండించారు.

హోం వర్క్ చేయలేదని పలకతో కొట్టిన టీచర్

- విద్యార్థి మృతి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో



హోంవర్క్ చేయలేదని పలకతో టీచర్ కొట్టడంతో విద్యార్థి ప్రాణం విడిచిన ఘటన హైదరాబాద్ ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామంతా పూర్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగరాజు, రాధ దంపతులు రామంతాపూర్ వివేక నగర్‌లో నివసిస్తున్నారు. వారి కుమారుడు హేమంత్ (4) స్థానికంగా ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో యుకెజి చదువుతున్నాడు. శనివారం హోంవర్క్ చేయలేదని హేమంత్ తలపై పలకతో టీచర్ కొట్టడంతో హేమంత్ తలకు తీవ్రగాయమై కుప్పకూలాడు. తల్లిదండ్రులకు స్కూల్ సిబ్బంది సమాచారం ఇచ్చి బాలుడిని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి బాలుడు సోమవారం మృతిచెందాడు. టీచర్, స్కూల్ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధిత కుటుంబ సభ్యులు పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించారు.

అరకొరగా నియామకాలు... శాఖల తగ్గింపు

- ప్రభుత్వ బ్యాంకుల్లో పనిభారం

5

ప్రజల్లోకి శాస్త్రీయ విజ్ఞానం

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్

పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు

- సేవ్ జర్నలిజం డే సందర్భంగా సదస్సులో వక్తలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి

లోపలి పేజీలో..

బీహార్‌లో 63% పైగా
వెనుకబడిన తరగతులవారే

- ఎస్సీలు 19 శాతం, ఎస్టీలు 1.68 శాతం
- కులగణన నివేదిక విడుదల చేసిన నితీష్ సర్కార్
- ఈ ప్రాతిపదికనే సామాజిక, ఆర్థిక అభివృద్ధికి చర్యలు

పాట్నా : దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిన బీహార్ కులగణన నివేదిక సోమవారం విడుదలైంది. జాతిపిత గాంధీ జయంతి సందర్భంగా బీహార్ ప్రభుత్వం విడుదల చేసిన ఈ నివేదిక, రాష్ట్ర జనాభాలో ఇతర వెనుకబడిన తరగతులు (ఒబిసి)లు, అత్యంత వెనుకబడిన తరగతులు (ఇబిసి)లు కలిసి 63 శాతానికి పైగా ఉన్నారని, ఎస్సీలు 19 శాతం దాకా ఉన్నారని తేల్చింది. ఈ తాజా నివేదిక వెల్లడించిన వివరాల ప్రకారం ఒబిసిలు 27.13 శాతం, ఇబిసిలు 36.01 శాతం ఉన్నారు. యాదవ, కుర్మి, కుష్వాహ తదితర కులాలను ఒబిసి కేటగిరి కింద సర్వేలో నమోదు చేశారు. ఎస్‌సిలు 19.65శాతం ఉండగా, ఎస్‌టిలు 1.68 శాతం ఉన్నారు. జనరల్ లేదా అగ్ర కులాలకు చెందిన జనాభా 15.52 శాతంగా ఉన్నారు. కులాలవారీగా చూస్తే యాదవులు అధికంగా ఉన్నారు. రాష్ట్ర మొత్తం జనాభాలో వీరు 14.26 శాతంగా ఉన్నారు. ఆర్జేడీకి కోర్ ఓటు బ్యాంక్‌గా వీరిని సాధారణంగా పరిగణిస్తారు. కుష్వాహ్‌లు 4.21, కుర్మీలు 2.87 శాతం ఉన్నారు. అగ్ర కులాల్లో బ్రాహ్మణులు అధికంగా ఉన్నారు. బీహార్ మొత్తం జనాభాలో వీరిది 3.6 శాతం. రాజ్‌పుత్‌లు 3.15 శాతం, భూమిహార్లు 2.86 శాతం ఉన్నారు.

ఈ నివేదిక ఆధారంగా అన్ని తరగతుల ప్రజల అభ్యున్నతికి, వారి ఆర్థిక పరిస్థితి మెరుగుదలకు తగు ప్రణాళికలు రూపొందిస్తామని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ చెప్పారు. సర్వే బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కుల ఆధారిత సర్వేకు అన్ని రాజకీయ పార్టీలు ఆమోదం ఉందని ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ సర్వే నివేదిక వివరాల గురించి తెలియజేయడానికి రాష్ట్ర అసెంబ్లీలోని మొత్తం తొమ్మిది రాజకీయ పార్టీలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, ఆర్‌జెడి నాయకులు తేజస్వి యాదవ్ ఈ సందర్భాన్ని 'చారిత్రాత్మక క్షణం'గా అభివర్ణించారు. 'కుల గణన డేటాను మిగతా 5 లో

దళితుడిపై థర్డ్ డిగ్రీ

- ఇద్దరు కానిస్టేబుళ్లు, ఎస్ఐ సస్పెన్షన్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ, పద్మనాభం, విశాఖ

ఓ దొంగతనం కేసులో నిందితునిగా ఉన్న దళితుడిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులు సస్పెన్షన్‌కు గురయ్యారు. నిందితుడి కాలు విరగ్గొట్టారని ప్రాథమిక విచారణలో తేలడంతో విశాఖ జిల్లా పద్మనాభం పోలీసు స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు, ఎస్ఐను సస్పెండ్ చేస్తూ నగర పోలీసు కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సిఐ సన్యాసినాయుడుకు ఛార్జిమెమో ఇచ్చారు. ఈ కేసు వివరాలను సిఐ సన్యాసినాయుడు మీడియాకు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలంలోని భాందేవుపురం గ్రామానికి చెందిన ఇందుకూరు రాజబాబుకు చెందిన కోడిపుంజును అదే గ్రామానికి చెందిన పాపు, గాలి ఎర్నిబాబు దొంగిలించారంటూ గత నెల 29న పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు అందింది. ప్రతిరోజూ నిందితులను సాయంకాలం విచారిస్తున్నారు. ఆదివారం రాత్రి 10 గంటలు అయినా పాపును విడిచిపెట్టకపోవడంతో ఆయన బంధువులు స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్‌లో పాపు కేకలు, ఏడుపులు వినిపించడంతో బంధువులు లోపలకు వెళ్లారు. అప్పటికే ఆయన కాలు విరిగి స్పృహ కోల్పోయి ఉన్నాడు. ఆయనను విజయనగరంలోని మహారాజా ఆస్పత్రికి తీసుకెళ్లారు. నిందితుడిని పోలీసులు మిగతా 5 లో

మాజీ మంత్రి బండారు అరెస్టు

- విజయవాడకు తరలింపు

ప్రజాశక్తి – పరవాడ (అనకాపల్లి)

అనుచిత వ్యాఖ్యల విషయమై టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తిని గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. మంత్రి రోజాపై చేసిన అనిచిత వ్యాఖ్యలపై ఒక కేసు, సిఎం జగన్‌పై చేసిన వ్యాఖ్యలపై రెండు కేసులు సత్యనారాయణపై నమోదైనట్టు పోలీసు అధికారులు తెలిపారు. తొలుత మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో ఆయనకు నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు ప్రయత్నించారు. తన ఇంటి తలుపులను సత్యనారాయణమూర్తి తెరవకపోవడంతో పోలీసులు హడావుడి చేశారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నిరాహార దీక్ష చేస్తున్న సత్యనారాయణకు వైద్య పరీక్షలు చేయించేందుకు టిడిపి నేతలు ప్రయత్నించారు. ఆయన ఇంటికి వచ్చిన ప్రయివేటు అంబులెన్స్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు బండారు ఇంటి తలుపులు బద్దలు కొట్టి పోలీసులు నోటీసులు అందజేశారు. 41 ఎ, 41 బి సెక్షన్ల కింద ఈ నోటీసులు అందజేసినట్లు వెల్లడించారు. అనంతరం అరెస్టు చేసి ఆయనను విజయవాడకు తరలించారు.

ఆదివారం రాత్రి నుంచే అరెస్టు ప్రయత్నాలు

బండారును అరెస్టు చేసేందుకు ఆదివారం రాత్రి 11 గంటల గంటల నుంచే ప్రయత్నాలు మొదలయ్యాయి. మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బండారుపై చర్యలు తీసుకోవాలని గత నెల 30న డిజిపిని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ కోరారు. దీంతో గుంటూరు పోలీసులు రంగంలోకి దిగారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు సుమారు 300 మంది పోలీసులు బండారు ఇంటి వద్ద మోహరించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మరోవైపు టిడిపి కార్యకర్తలు సుమారు 1600 మంది ఆయన ఇంటికి చేరుకోవడంతో తొలుత పోలీసులు ఆలోచనలో పడ్డారు. బండారుకు తోడుగా మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు. చివరకు బండారు ఇంట్లోకి వెళ్లి ఆయనను అరెస్టు చేశారు.



బండారును అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

6 దశల్లో వెరిఫికేషన్

- పది, ఇంటర్ విద్యార్థులకు రెవెన్యూశాఖ నుంచి ఇన్‌కం సర్టిఫికెట్ల జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆదాయ సర్టిఫికెట్లు మంజూరు సులభతరం చేస్తూ రెవెన్యూశాఖ సోమవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. పాఠశాల అడ్మిషన్లు, స్కాలర్‌షిప్పులు, సంక్షేమ పథకాలు, ఫీజు మినహాయింపులు వంటి ప్రయోజనాల కోసం బిపిఎల్‌ను నిర్ధారించేందుకు మంజూరు చేసే ఇన్‌కమ్ సర్టిఫికెట్స్ గురించి ప్రభుత్వం మరోసారి సూచనలు చేసింది. బిపిఎల్ నిర్ధారణకు తెల్లరంగు రేషన్‌కార్డు సరిపోతుందని పేర్కొన్నప్పటికీ ఆయా పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసిన సమయాల్లో ఇన్‌కమ్ సర్టిఫికెట్స్ ఎప్పటికప్పుడు అడుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. గత రెండేళ్లలో ఇటువంటి సర్టిఫికెట్లు సుమారు 75 లక్షల వరకు ఇచ్చినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు సంబంధించి సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత విభాగాధిపతులతో ప్రభుత్వం తాజాగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. సమావేశంలో వచ్చిన ఫీడ్ బ్యాక్‌ను బట్టి నూతనంగా సంబంధిత అధికారులకు ప్రభుత్వం సూచనలు చేసింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెవెన్యూశాఖ నేరుగా ఆదాయ సర్టిఫికెట్లు మంజూరు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ శాఖలైన సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, (బిసి వెల్ఫేర్, మైనార్టీ, ట్రైబల్‌తోపాటు మిగిలిన వెల్ఫేర్ డిపార్టుమెంట్లు) నుంచి రాయితీల కోసం ప్రత్యేకంగా ఇన్‌కమ్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిన అవసరం లేదని ఉత్తర్వుల్లో పేర్కొంది. సర్టిఫికెట్ల విషయంలో గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఆధార్ నెంబరు లింకేజీతో 6 దశల్లో విచారించిన అనంతరం అప్లికేషన్‌ను ప్రాసెసింగ్‌లో అనుసంధానిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఇడబ్ల్యుఎస్ సర్టిఫికెట్, కేంద్ర ప్రభుత్వ సంబంధిత అవసరాలు, జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం వంటి నిర్దిష్ట కేసుల్లో ఇప్పుడు సర్టిఫికెట్లు జారీ చేసే పద్ధతి కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏదైనా కొత్త అవసరాలు, లేక మినహాయింపులు విషయంలో సంబంధితశాఖ రెవెన్యూ (భూములు) సమ్మతిని తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. అన్ని విభాగాల అధిపతులు, సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు సూచనలు పాటించేలా చూడాలని జిల్లా కలెక్టర్లు, తహశీల్దార్లకు సూచించాలని పేర్కొంది.

సమగ్ర శిక్ష, కెజిబివి ఉద్యోగులకు రెగ్యులర్, గ్రాస్ పే అమలు చేయాలి

- గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం కొన్ని శాఖల్లో ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిందని, సమగ్రశిక్ష, కెజిబివి ఉద్యోగులకు రెగ్యులర్, గ్రాస్‌పే అమలు చేయాలని ఎఐ సమగ్ర శిక్షా కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెజిబివి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా గాంధీజీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్ఎస్ఎ, కెజిబివి ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకపోతే సమ్మెకు సిద్ధమవుతామని నాగేశ్వరరావు పేర్కొన్నారు.



గాంధీ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పవన్ కల్యాణ్

నయా బ్రిటీష్ పాలకులను తరిమికొట్టాలి

- మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పవన్ మౌన దీక్ష

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

బ్రిటీషర్ల లక్షణాలను పుణికి పుచ్చుకున్న పాలకులు రాష్ట్రంలో ఉన్నారని, ప్రజలను విభజించి పాలించే ధోరణితో వెళుతున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. గాంధీ చెప్పిన ఓటు, సత్యాగ్రహం ఆయుధాలను ఉపయోగించి నయా బ్రిటీష్ పాలకులను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని కోరారు. మహాత్మా గాంధీ 154వ జయంతి సందర్భంగా కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రెండు గంటల సేపు పవన్ కల్యాణ్ మౌన దీక్ష చేపట్టారు. వారాహి నాలుగో విడత యాత్రలో భాగంగా కృష్ణా జిల్లాలో పర్యటిస్తున్న ఆయన ముందుగా మచిలీపట్నం సువర్ణ కల్యాణ మండపంలో గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. జనసేన పార్టీ జిల్లా కార్యవర్గంతో కలిసి జాతి నేతలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. సత్యం, అహింసా, శాంతి, సహనాలను పాటిస్తూ ఎన్ని కష్టాలెదురైనా ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని మహాత్మా గాంధీ నిరూపించారని, ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకెళతామని అన్నారు. అహింసాయుతమైన ప్రజా ఉద్యమాలతో పరాయి పాలన నుంచి దేశాన్ని విముక్తి చేశారని గుర్తుచేశారు. అనంతరం మౌన దీక్ష చేపట్టారు. దీక్ష విరమణ అనంతరం జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా నాయకులతో సమావేశమయ్యారు.

ప్రజల్లోకి శాస్త్రీయ విజ్ఞానం

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాస్త్రీయ దృక్పథాన్ని, విజ్ఞానాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సైన్సుపై జరుగుతున్న దాడిని మేధావులు, విద్యావంతులు సమర్థవంతంగా ఎదుర్కోవాలని కోరారు. అలాగే శాస్త్ర విజ్ఞానాన్ని రాష్ట్రంలో నలుమూలలా వ్యాప్తి చేయాలన్నారు. జెవివి సబ్‌కమిటీ కన్వీనర్లు ఇందుకు విశేష కృషి చేయాల్సిన అవసరం వుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు 12 సబ్ కమిటీలకు కన్వీనర్లను ఈ సమావేశంలో ఎంపిక చేశారు. అంతర్గత విద్య కన్వీనర్‌గా కె త్రిమూర్తులు, జనవిజ్ఞానం కమిటీకి కె శ్రీనివాస్, చెకుముఖి కమిటీకి ఎస్ఎన్ రమేష్, పర్యావరణ కమిటీకి కెవివి సత్యనారాయణ, ఆరోగ్య కమిటీకి ఎఎస్ ప్రసాద్, ఉన్నత విద్య, వ్యవసాయం కమిటీలకు వైఎస్ నాగేశ్వరరావు, సోషల్ మీడియా, రికార్డు నిర్వహణ, ప్రెస్ కమిటీకి సిహెచ్ జయ ప్రకాష్, సాంస్కృతిక, మద్య, మాదకద్రవ్య వ్యతిరేక కమిటీకి కెఎమ్ఎమ్ఆర్ ప్రసాద్, సైన్సు కమ్యూనికేషన్ కమిటీకి పివి గోపాలరావు, స్కూల్ ఎడ్యుకేషన్ కమిటీకి గొంటి గిరిధర్, పబ్లికేషన్ కమిటీకి దార్ల బుజ్జిబాబు, సమత కమిటీకి జి నిర్మల ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జెవివి ప్రధాన కార్యదర్శి కె రామారావు, పూర్వ అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్, మాజీ ప్రధాన కార్యదర్శులు గొంటి మురళీధర్, కె శ్రీనివాస్, ఎస్ఎన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జనవిజ్ఞాన వేదిక బ్రోచర్ ఆవిష్కరిస్తున్న గేయానంద్ తదితరులు

పర్యాటకంపై తగ్గిన మక్కువ

- ఏడాదిలో లాభాలు రూ.8 కోట్లే
- గణనీయంగా పడిపోయిన ఆదాయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో పర్యాటకానికి ప్రాధాన్యత తగ్గుతున్నట్లు తెలుస్తోంది. ప్రతియేటా ఆదాయంపై లక్ష్యాలను భారీగా నిర్దేశిస్తున్నప్పటికీ అనుకున్న లక్ష్యాలను మాత్రం సాధించలేకపోతున్నట్లు స్పష్టమవుతోంది. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.ఎనిమిది కోట్లు మాత్రమే లాభాలు వచ్చినట్లు పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రకటించడం గమనార్హం. పలు పర్యాటక ప్రాంతాలకు వెళ్లేవారు కూడా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న హోటళ్ల కన్నా ప్రైవేటు వసతి గృహాలపైనే మక్కువ పెంచుకుంటున్నట్లు కనిపిస్తోంది. పర్యాటక రంగంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.11.21 కోట్లు లాభాలు మాత్రమే రాగా, 2022-23లో మరింతగా తగ్గిపోయి కేవలం 8.02 కోట్లు మాత్రమే లాభాలుగా తేలాయి. సంస్థ చెబుతున్న లెక్కల మేరకు 2021-22లో రూ.145 కోట్లు ఆదాయం వచ్చింది. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఈ ఆదాయం రూ.163 కోట్లుగా ఉంది. ఆదాయం స్వల్పంగా పెరిగినప్పటికీ వ్యయం కూడా పెరగడంతో లాభాలు తగ్గినట్లు తేలింది. 2021-22లో రూ.130 కోట్లు వ్యయం జరిగింది. అదే 2022-23లో రూ.150 కోట్లు వ్యయంగా గుర్తించారు. అందుకే లాభాలు తగ్గినట్లు కనిపిస్తోందని అధికారులు అంటున్నారు.

హోటళ్ల తారిఫ్ వల్లే..

పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని హోటళ్లలో సౌకర్యాలు మెరుగ్గానే ఉంటున్నప్పటికీ, అందులో గదులకు వసూలు చేసే ధరలు అధికంగా ఉంటున్నట్లు పర్యాటకులు భావిస్తున్నారు. అందుకే కొంతవరకు తక్కువగా టారిఫ్ ఉండే ప్రైవేటు హోటళ్లవైపు పర్యాటకులు మొగ్గు చూపిస్తున్నట్లు కనిపిస్తోందని అధికారులే అంగీకరిస్తున్నారు. 2021-22లో హోటళ్ల ద్వారా రూ.89 కోట్లు ఆదాయంగా లభించగా, 2022-23లో ఈ మొత్తం రూ.69 కోట్లకు పడిపోవడం గమనార్హం. పలు ప్యాకేజీల ద్వారా ఏర్పాటుచేసిన టూరిజం ఆదాయం మాత్రం కొద్దిగా పెరిగింది. 2021-22లో రూ.26 కోట్లు ఈ రంగంలో ఆదాయంగా లభించగా, 2022-23లో రూ.49 కోట్లకు పెరగడం విశేషం. పెరిగిన వ్యయంలో నిర్వహణ వ్యయం, సర్వీస్ వ్యయం బాగా పెరిగినట్లు తేలింది. గతేడాది రూ.61 కోట్లుగా ఈ వ్యయం ఉండగా, ముగిసిన ఆర్థిక సంవత్సంలో రూ.71 కోట్లకు పెరిగింది. ఉద్యోగులపై చేసే వ్యయం కూడా రూ.42 కోట్ల నుంచి 52 కోట్లకు పెరిగింది.

లోకేష్‌తో పాటు విచారణకు రండి

- మాజీ మంత్రి నారాయణకు సిఐడి నోటీసులు

ప్రజాశక్తి - అమరావతి, హైదరాబాద్ బ్యూరో

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో ఎ2 నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి నారాయణకు ఎపి సిఐడి మరోసారి నోటీసులిచ్చింది. ఈనెల 4న విజయవాడలోని సిఐడి కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని సూచించింది. ఈ మేరకు సోమవారం సిఐడి అధికారులు నారాయణకు వాట్సప్ ద్వారా 41ఎ నోటీసులు జారీచేశారు. గత ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన నారాయణ... సిఆర్‌డిఎ వైస్ చైర్మన్‌గా కూడా వ్యవహరించారు. ఇదే కేసులో మాజీ మంత్రి లోకేష్ కూడా ఈనెల 4న విచారణకు హాజరుకావాలని సిఐడి నోటీసులు జారీచేసిన విషయం తెలిసిందే. అయితే, నారాయణ, లోకేష్‌ను కలిపి సిఐడి అధికారులు విచారిస్తారని విశ్వసనీయ సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా వినుకొండ పట్టణానికి సమీపంలోని మార్కాపురం రోడ్డు పసుపులేరు బ్రిడ్జి వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శావల్యాపురం ముంద్రువారిపాలేనికి చెందిన కొమ్మతోటి నవీన్ (24), కనమలపూడికి చెందిన యెహోషువా (22) ఇద్దరూ కలిసి శుభకార్యాల్లో ఆర్కెస్ట్రా ఈవెంట్లు చేస్తుంటారు. నవీన్ స్నేహితుడైన ప్రకాశం జిల్లా పెద్దారవీడుకు చెందిన రాజాల శివారెడ్డి (21) వినుకొండ పట్టణంలో రెడీమేడ్ వస్త్ర దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. శివారెడ్డికి పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన అన్వేష్, ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన మహేష్ అనే ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రకాశం జిల్లా కుంట వద్ద ఓ ఈవెంట్‌కు నవీన్, యెహోషువా వెళ్తూ శివారెడ్డిని పిలిచారు. శివారెడ్డి అతని స్నేహితులైన అన్వేష్, మహేష్‌ను పిలిచారు. అందరూ కలిసి కారులో వెళ్లారు. ఈవెంట్ ముగిసిన అనంతరం వినుకొండకు తిరిగి వస్తుండగా సోమవారం తెల్లవారుజామున కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి పై పసుపులేరు బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న సంఘం పాల డెయిరీ లారీ ఢీకొట్టింది. నవీన్, శివారెడ్డి, యెహోషువా అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కొమ్మతోటి నవీన్ (ఫైల్)



యెహోషువా (ఫైల్)



రాజాల శివారెడ్డి (ఫైల్)

పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు

- సేవ్ జర్నలిజం డే సందర్భంగా సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రాణవాయువు వంటిదని విజయవాడ సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపల్ చెన్నుపాటి దివాకర్‌బాబు అన్నారు. సేవ్ జర్నలిజం డేను పురస్కరించుకుని విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎపియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో 'రాజ్యాంగం విలువలు-ప్రజాస్వామ్యం-పత్రికా స్వేచ్ఛ' అనే అంశంపై సోమవారం చర్చా వేదిక జరిగింది. ఈ కార్యక్రమానికి ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దివాకర్‌బాబు మాట్లాడుతూ.. పత్రికా స్వేచ్ఛతోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని, రాజ్యాంగ విలువలు రక్షింపబడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశమంతటా ప్రధాన మీడియా కార్పొరేట్ల చేతుల్లో ఉండటం పత్రికా స్వేచ్ఛకు ప్రమాదకరంగా పరిణమించిందన్నారు. ప్రజాస్వామ్య పాలనలో పౌరుల భాగస్వామ్యంతో క్రియాశీలకంగా వ్యవహరించాలని, దానికి పత్రికా రంగం ప్రాధాన్యత అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తే రాజద్రోహం కాదని, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి హింసను ప్రేరేపిస్తే రాజద్రోహం అవుతుందని పేర్కొన్నారు.




చర్చా వేదికలో మాట్లాడుతున్న చెన్నుపాటి దివాకర్‌బాబు, చిత్రంలో కె.జయరాజ్, ఎ.సురేష్‌కుమార్, ఐవి సుబ్బారావు, బి.తులసీదాస్, చందు జనార్ధన్, చావా రవి

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ విడదీయరానిదని, ప్రజల ప్రయోజనాలను పత్రికలు, పాత్రికేయులు కాపాడితే జర్నలిస్టుల కోసం ప్రజలు నిలబడతారని ప్రజాశక్తి ఎడిటర్ బి తులసీదాస్ పేర్కొన్నారు. రాజ్యాంగంపై జరిగే దాడిని తిప్పికొట్టడానికి ఒక వ్యక్తికానీ, ఒక సంఘంగా కానీ కాకుండా సమిష్టిగా కృషి చేయాలన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో భారతీయులందరూ కుల, మత, ప్రాంత, భాషా, జాతి భేదాలు లేకుండా ఒక్కటై పోరాడి బ్రిటీష్ వాళ్లను పారదోలారన్నారు. ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు మాట్లాడుతూ.. జర్నలిస్టులపై జరిగే దాడులను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై 25కు పైగా కేసులు నమోదయ్యాయని, ఆయా కేసులన్నింటినీ రద్దు చేయాలని అన్నారు. కరోనా సమయంలో మృతిచెందిన జర్నలిస్టులకు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఐజెయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్‌కుమార్, ఎపియుడబ్ల్యుజె ఉపాధ్యక్షులు కె.జయరాజ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మరాజు చలపతిరావు, ఆర్ వసంత్, యూనియన్ విజయవాడ కార్యదర్శి కొండా రాజేశ్వరరావు ప్రసంగించారు.

విశాఖ రైల్వే ప్రాజెక్టులపై ప్రధాని శంకుస్థాపనలకే దికానా లేదా?

- కేంద్ర నిర్లక్ష్యంతో నీరుగారుతున్న వాల్తేరు రైల్వే ప్రగతి
- కదలని రైల్వే రీ డెవలప్‌మెంట్ రూ.456 కోట్ల పనులు
- విశాఖ - గోపాలపట్నం రెండు లైన్లకూ అదే గతి



రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్న ప్రధాని మోడీ (ఫైల్)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్రమోడీ పునాదిరాయి వేసిన రైల్వే ప్రాజెక్టులకు సైతం విశాఖలో దిక్కూమొక్కూ లేకుండా పోయింది. 2022 నవంబర్ 12న విశాఖ రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్ అంటూ రూ.456 కోట్లతో జ్ఞానాపురం వైపు 2 ప్లాట్‌ఫారాలు, కొత్త స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి సుమారు ఏడాది కావొస్తున్నా పనుల్లో పురోగతి లేదు. రైల్వే బోర్డు ఆమోదం ఈ పనులకు లభించకపోవడం గమనార్హం. దేశంలోని వంద రైల్వే స్టేషన్ల అభివృద్ధికి బిజెపి సర్కారు కట్టుబడి ఉందంటూ కాషాయ పెద్దలు ఊదరగొట్టిన వాటిలో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఎలాంటి అభివృద్ధికీ నోచుకోవడం లేదు. ఎపి విభజన తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరంగా విశాఖ ఉంది. ఎనిమిది ప్లాట్‌ఫారాలు స్టేషన్‌లో ఉన్నాయి. మరో రెండు ప్లాట్‌ఫారాలను జ్ఞానాపురం వైపు విస్తరించి, కొత్త స్టేషన్ భవనం నిర్మించాల్సి ఉన్నా, ఆ దిశగా పనులు జరగడం లేదు. పదేళ్ల క్రితమే విశాఖ రైల్వే స్టేషన్ ట్రాఫిక్ రద్దీపై కేంద్ర బృందం సర్వే చేపట్టి ప్లాట్‌ఫారాలను పెంచుకోవాలని తన నివేదికలో వెల్లడించింది. ప్రధాని శంకుస్థాపన చేసిన వాటిలో విశాఖపట్నం-గోపాలపట్నం రెండు లైన్ల ప్రతిపాదన కూడా ఉంది. రూ.159.47 కోట్లతో ఈ ప్రాజెక్టు రూపొందించారు. వీటికి రైల్వే బోర్డు ఆమోదం 2022లోనే గత డిఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్‌పతి సాధించారు. ఇవి గాకుండా రైల్వేస్టేషన్ అభివృద్ధి, వడ్లపూడి గేట్ జంక్షన్ కేబిన్, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, దువ్వాడ, సింహాచలం ఉత్తరం వద్ద రైల్వే ఫ్లై ఓవర్ల నిర్మాణానికి రూ.800 కోట్ల ప్రాజెక్టు ప్రతిపాదనలకు రైల్వే బోర్డు ఆమోదం సాధించినా, ఒక్క పనీ ప్రారంభం కాలేదు. ముఖ్యంగా సింహాచలం క్రాసింగ్ వద్ద పైనుంచి వెళ్లే వాహనాల రద్దీ కోసం ఆర్‌ఓబిని ప్రతిపాదించారు. విశాఖ రైల్వే స్టేషన్ వైపు రద్దీ తగ్గాలంటే, ఈ ప్రాజెక్టులు తక్షణం పూర్తి కావాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులేవీ అలముకానందున ముఖ్యమైన రైళ్లు సైతం విశాఖ స్టేషన్ వైపు కాకుండా దువ్వాడ మీద నుంచి వెళ్లిపోతున్నాయి.

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కూ మంగళమేనా ?

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను 2019 సాధారణ ఎన్నికల్లో కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్నికల హామీగా మరోసారి ముందుకు తెచ్చింది. స్వయంగా విశాఖలో బిజెపి నిర్వహించిన సభలో మోడీ ప్రసంగిస్తూ రైల్వే జోన్ ప్రకటన చేశారు. ఆయనే స్వయంగా చెప్పారు కాబట్టి జరిగి తీరుతుందని ఉత్తరాంధ్ర ప్రజలు ఆశించారు. ఆ వాగ్దానం అమలు కాలేదు సరికదా, దేశంలోనే అత్యధిక ఆదాయం సంపాదించే డివిజన్లలో రెండోదైన వాల్తేరు రైల్వేను మోడీ సర్కారు లేపేసింది.

సిపిఎం వామపక్షాలు, ఇతర రాజకీయ ప్రధాన పార్టీలు (బిజెపి మినహా) ఈ దుందుడుకు చర్యను తీవ్రంగా వ్యతిరేకించాయి. 2022 నవంబర్‌లో విశాఖ నగరంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు మోడీ శంకుస్థాపనలు చేశారు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు కూడా శంకుస్థాపన చేయనున్నారంటూ అంతకు ముందు నెల రోజుల నుంచీ బిజెపి నేతలు తెగ హడావుడి చేశారు. మరోపక్క విశాఖలోని వైర్‌లెస్ కాలనీ రైల్వే స్కూల్ గ్రౌండ్స్‌లో శిలాఫలకం కూడా సిద్ధం చేశారు. కానీ, ప్రధాని సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేయకుండానే వెళ్లిపోయారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం 40 ఎకరాలను కొత్త భవనాల కోసం ముడసర్లోవలో సిద్ధం చేసింది. కానీ, రైల్వే జోన్‌కు పునాదిరాయి పడలేదు. విశాఖలో తాజాగా పర్యటించిన రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ ఈ సమస్యలన్నిటినీ సీనియర్ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు తెలియజేస్తానంటూ తాజా పర్యటనలో చెప్పడం విశేషం.



దీక్షలో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

'ఉక్కు' ఉద్యమంలో భాగస్వాములుకండి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 963వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సిఐసిసిపి విభాగం కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటువారికి అప్పగించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి ఎదురు తిరిగి పోరాడుతున్నామని, కార్మికులు, నిర్వాసితుల మద్దతుతో సుదీర్ఘ కాలంగా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు. అయినప్పటికీ మోడీ సర్కారు వెనక్కుతగ్గడం లేదన్నారు. ప్లాంట్‌పై రాష్ట్ర బిజెపి నేతలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారానే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, టి.కనకరాజు, కర్రి బాబూరావు, కె.ఆనంద్ కుమార్, ఎస్‌కె.మొహిద్దిన్, కె.సుబ్బారావు, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మహాత్మా గాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రికి గవర్నరు, సిఎం నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రికి గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. రాజ్‌భవన్‌లో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు గవర్నరు నివాళులర్పించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు సిఎం సోమవారం పుష్పాంజలితో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా, మాజీ ప్రధానిగా లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని, జై జవాన్, జై కిసాన్ అంటూ ఆయన ఇచ్చిన పిలుపు నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉందని సిఎం జగన్ 'ఎక్స్'లో గుర్తుచేశారు.



సదస్సులో మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రమణ్యం

గాంధీ స్ఫూర్తితో మత సామరస్యాన్ని చాటాలి

- అన్ని రంగాల్లోకి చొరబడుతున్న మతతత్వ శక్తులు
- మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

గాంధీ స్ఫూర్తితో మతసామరస్యాన్ని చాటాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం కోరారు. గాంధీ జయంతి సందర్భంగా 'వర్తమాన పరిస్థితులు - మత సామరస్యం - ఆవశ్యకత' అనే అంశంపై సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో కర్నూలులోని లలిత కళాసమితిలో సోమవారం సదస్సు నిర్వహించారు. విఠపు బాలసుబ్రమణ్యం ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. మతతత్వ శక్తులు అన్ని రంగాల్లోకి చొరబడుతున్నాయని, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, విడగొట్టడం చేస్తున్నాయని విమర్శించారు. చివరికి టిప్పుసుల్తాన్, అశోకుల చరిత్రను కూడా వక్రీకరిస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తున్నారని, అధ్యక్షతన పాలన వచ్చినా ఆశ్చర్యం లేదని తెలిపారు. భారత సంస్కృతి మహాప్రవాహం లాంటిదని, ఆ ప్రవాహాన్ని ముక్కలుగా చేయాలనుకోవడం ఘోరమైన విషయమన్నారు. దుర్మార్గమైన ఆర్థిక విధానాలను కప్పిపుచ్చడానికి మతం చుట్టూ జనాలను తిప్పుతున్నారని విమర్శించారు. నేడు మళ్లీ గాంధీ అవసరం పెరిగిపోయిందన్నారు. దేశం ఒకటిగా ఉండాలని కోరుకున్న గొప్పవ్యక్తి గాంధీ అని కొనియాడారు. బ్రిటిష్ వాళ్లకు లొంగిపోతున్నట్లు సావర్కర్ మూడు ఉత్తరాలు రాశారని, గాంధీ రాయమంటే క్షమాపణ పత్రాలను సావర్కర్ రాశారని రాజ్‌నాథ్ సింగ్ చెప్పడం దుర్మార్గమన్నారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జెఎన్. శేషయ్య అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ జి.శంకరశర్మ, రవీంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కో-కన్వీనర్ ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

(మొదటి పేజీ తరువాయి)

పూర్తవలేదన్నారు. పారిశ్రామికాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని తెలిపారు. విలువైన ఖనిజ నిక్షేపాల నిలయం రాయలసీమ అని గుర్తు చేశారు. పెద్దపెద్ద కంపెనీలకు ఇక్కడున్న వేల ఎకరాల భూములను ప్రభుత్వాలు కట్టబెట్టేస్తున్నాయన్నారు. అయితే, ఒక్క పరిశ్రమా ఏర్పాటు చేయలేదని తెలిపారు. చిలమత్తూరు మండలంలో 8,484 ఎకరాల భూమిని లేపాక్షి నాలెడ్జి హబ్ పేరుతో తీసుకుని పరిశ్రమ పెట్టకుండానే, రూ.700 కోట్ల అప్పు తీసుకుని ఎగ్గొట్టారన్నారు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేయకుండానే నష్టం వచ్చిందనడం ప్రపంచంలోనే ఒక వింత అని వ్యాఖ్యానించారు. ఇక ఆదానీ సంస్థకు ఇదే రకంగా భూములు కేటాయిస్తున్నారన్నారు. సోలార్ ద్వారా విద్యుదుత్పత్తికి కారుచౌకగా భూములు కేటాయిస్తున్నారని విమర్శించారు. నెలకు వారికేమో ఎకరంలో ఐదారు లక్షల రూపాయలు ఆదాయమొస్తుంటే, రైతులకేమో ఏడాదికి రూ.30 వేలు లీజు ఇస్తామంటున్నారని అన్నారు. ఎకరానికి నెలకు రూ.30 వేలు రైతులకు లీజు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సదస్సులో సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పెద్దన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకులు కృష్ణ, ఎస్‌యుసిఐసి జిల్లా కార్యదర్శి రాఘువేంద్ర, ప్రజా పరిరక్షణ వేదిక కన్వీనర్ సత్యబోసు, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు. మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, సావిత్రి, సిపిఎం సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, కర్నూలు జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, నంద్యాల జిల్లా కార్యదర్శి రమేష్, తిరుపతి జిల్లా కార్యదర్శి నాగరాజు, అన్నమయ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కడప జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ప్రకాశం జిల్లా కార్యదర్శి హనీఫ్, చిత్తూరు జిల్లా కార్యదర్శి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జయంతి రోజున దీక్షలు సిగ్గుచేటు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవినీతి కేసులో అరెస్ట్ అయి జైల్లో ఉన్న చంద్రబాబుకు సంఘీభావంగా మహాత్మా గాంధీ జయంతి రోజున టిడిపి దీక్షలు చేయడం సిగ్గుచేటని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు సోమవారం పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సజ్జలతోపాటు మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, మాజీ మంత్రులు వెలంపల్లి శ్రీనివాస్, శిద్దా రాఘవరావు, డొక్కా మాణిక్య వరప్రసాద్, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపి నందిగం సురేష్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రుహుల్లా, ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు. అనంతరం సజ్జల మాట్లాడుతూ.. గాంధీ జయంతి రోజున చంద్రబాబు నిరాహార దీక్ష చేయడం సరైంది కాదన్నారు. ఒకప్పుడు ధనవంతులే ఫ్యామిలీ డాక్టర్‌ను పెట్టుకునేవారని, ఇప్పుడు ప్రతి ఇంటికీ ఫ్యామిలీ డాక్టర్‌ను ప్రభుత్వం నియమించిందని అన్నారు.

రామాయపట్నం పోర్టును కేంద్రమే నిర్మించాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి-గుడ్లూరు (నెల్లూరు)

రామాయపట్నం పోర్టును కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. తీరంలో నిర్మిస్తోన్న ఓడరేవులకు రూ. వేల కోట్లు ప్రజాధనం ఖర్చు చేసి, పోర్టు పూర్తయ్యాక అదానికి అప్పగించడానికి పాలకవర్గాలు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం కొనసాగుతున్న సిపిఎం పాదయాత్ర సోమవారం నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చేవూరు గ్రామం నుంచి ప్రారంభమైంది. ఈ యాత్రను నర్సింగరావు ప్రారంభించారు. తొలుత సిపిఎం బృందం పోర్టు ప్రాంతాన్ని సందర్శించింది. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించింది. అనంతరం చేవూరు గ్రామంలో నిర్వహించిన సభనుద్దేశించి నర్సింగరావు మాట్లాడారు. రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని, 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోర్టుకు అనుబంధంగా నిర్మించాలనుకుంటున్న పరిశ్రమలకు ఇప్పటికే ఉన్న భూములు సరిపోతాయని, చేవూరు గ్రామస్తుల భూములు లాక్కోవాలని చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ల్యాండ్ పూలింగ్ పేరుతో రైతులను పాలకవర్గాలు దగా చేస్తున్నాయని దుయ్యబట్టారు. భారతదేశంలో నిర్మించిన పోర్టులన్నీ అదాని, అంబానీకి ధారాదత్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు.

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం పలువురు ప్రాణ త్యాగం చేశారని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదాలు కేంద్రాన్ని కదిలించడంతో భూములు కోల్పోయిన రైతులు, కార్మికులు, కర్షకులు కొంతవరకైనా తమ హక్కులు సాధించుకున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని అరెస్టు చేసిన తీరు సరికాదన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడి ఉంటే విచారణ జరిపి తగిన చర్య తీసుకోవాలని పేర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ. ఉపాధిహామీ చట్టం కింద కనీసం 200 రోజులు పని కల్పించి, రోజుకూ రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, గోపాల్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్‌కె మస్తాన్‌బీ, జిల్లా నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న నర్సింగరావు

4న చిత్తూరులో కాంగ్రెస్ బహిరంగ సభ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'సేవ్ ది నేషన్ - సేవ్ డెమొక్రసీ' నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో సోమవారం సేవ్‌ది నేషన్-సేవ్ డెమొక్రసీ పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి, వైసిపి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని, ఈ నెల 3న ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. 4న చిత్తూరులో బహిరంగ సభ, 5న మదనపల్లిలో, 6న కడపలో ఉక్కు కర్మాగారం కోసం ప్రత్యేకంగా బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకోవడంతోపాటు రెండో విడత ఎంబిబిఎస్ సీట్ల కౌన్సెలింగ్‌లో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వర్గాలకు జరిగిన అన్యాయం వంటి అనేక ప్రజాసంబంధ సమస్యలపై కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. మీడియా సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ, నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు నిర్ణయాన్ని బట్టి భవిష్యత్తు కార్యాచరణ

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో / న్యూఢిల్లీ

దొంగ కేసులు, అక్రమ కేసుల నుంచి న్యాయం, చట్టాలే తమను కాపాడుతాయని, కోర్టు నిర్ణయాన్ని బట్టి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ, సోమవారం ఢిల్లీలో లోకేష్ ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత టిడిపి ఎంపి కనకమేడల రవీంద్రకుమార్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అనంతరం లోకేష్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 3న సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ విచారణకు వస్తుందన్నారు. ఆధారాలు లేని స్కిల్ డెవలప్‌మెంట్‌లో చంద్రబాబును జైలుకు పంపడమే కాకుండా మరో మూడు కేసులు సిద్ధం చేశారన్నారు. మంత్రి రోజా తనతోపాటు తన తల్లి భువనేశ్వరి, సతీమణి బ్రాహ్మణిని జైలుకు పంపుతామని అంటున్నారని, ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్యేనని అన్నారు. తమపై పెట్టిన తప్పుడు కేసులను ఆధారాలతో సహా అన్నీ ప్రజల ముందు ఉంచుతామని లోకేష్ వెల్లడించారు. లోకేష్ దీక్షకు ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయు) జాతీయ అధ్యక్షులు కె శ్రీనివాసరెడ్డి, ఎపి మేధావుల సంఘం నాయకులు చలసాని శ్రీనివాసులు, పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైసిపి నాయకులు డివై దాస్‌తో పాటు ఎంపిలు కనకమేడల రవీంద్రకుమార్, కేశినేని నాని, కె రామ్మోహన్‌నాయుడు, వైసిపి ఎంపి రఘురామ కృష్ణరాజు, మాజీ ఎంపి కంభంపాటి రామ్మోహనరావు, మాజీ మంత్రి కొండ్రు మురళి, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న లోకేష్, టిడిపి నేతలు

పార్టీ కేంద్ర కార్యాలయంలో...

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు నిరాహార దీక్ష చేపట్టారు. అంతకుముందు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొమ్మారెడ్డి పట్టాభిరామ్, శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఎ షరీఫ్ పాల్గొన్నారు.

టిడిపి, జనసేన కలయికను ప్రజలు హర్షించరు

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి, జనసేన పార్టీల అపవిత్ర కలయికను ప్రజలు పూర్తిగా తప్పు పడుతున్నారని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. చంద్రబాబును కలిశాక పవన్‌కల్యాణ్ చేపట్టిన వారాహి-4 యాత్రకు ఏమాత్రం స్పందన రాకపోవడమే వారి కలయికను ప్రజలు స్వాగతించడం లేదని అర్థమవుతోందన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర రాజకీయాల్లో చంద్రబాబు తర్వాత అనైతిక వ్యక్తి పవన్‌కల్యాణేనని విమర్శించారు. పవన్‌కల్యాణ్ బిజెపితో వుంటూ టిడిపితో పొత్తు పెట్టుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కాపులు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు వెళ్లి పవన్‌కల్యాణ్ సభలు పెడుతున్నారన్నారు. ఇదంతా నక్కజిత్తుల చంద్రబాబు జిమ్మిక్కు అని ఆరోపించారు. జనసేన కార్యకర్తలు ఇక జనసైనికులు కాదని, సైకిల్ సైనికులనే అంశాన్ని గుర్తుంచుకోవాలని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అవినీతి డబ్బుతో ఇప్పుడు వారాహి యాత్ర నడుస్తోందన్నారు.

ఐక్య పోరాటాలకు మున్సిపల్ కార్మికులు సిద్ధమవ్వాలి

- విస్తృత సమావేశంలో సిఐటియు జాతీయ నాయకులు ఎస్ వరలక్ష్మి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

దళిత, గిరిజన, బలహీనవర్గాలకు చెందిన మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికుల ఉద్యోగాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పర్మినెంట్ చేయాలని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎస్ వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఐక్య పోరాటాలకు మున్సిపల్ కార్మికులందరూ సిద్ధమవ్వాలని కోరారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కొరటాల బాపనయ్య భవన్లో సోమవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర వర్క్ షాపులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అండర్ గ్రౌండ్ డ్రయినేజీ శుభ్రం చేస్తూ, ఆ కాలువల్లో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు బజారున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య హక్కులను ఖూనీ చేస్తున్నాయని విమర్శించారు. దేశ ప్రజలకు సేవ చేస్తున్న మున్సిపల్ పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం కార్మికుల సేవలను గుర్తించకుండా, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వాలు దగా చేస్తున్నాయని తెలిపారు. పాలకుల మోసాలను తిప్పికొడుతూ కార్మిక వర్గం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ లక్షలాది మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు పర్మినెంట్ చేస్తామన్న సిఎం జగన్ వాగ్దానాలను తుంగలో తొక్కారని అన్నారు. రాష్ట్ర వర్క్‌షాప్‌లో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె ధనలక్ష్మి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌సిహెచ్ శ్రీనివాసరావు, మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణం తదితరులు ప్రసంగించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కలిసి వచ్చే సంఘాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర వర్క్ షాప్ పిలుపునిచ్చింది.



ఎపి మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్క్ షాప్ లో మాట్లాడుతున్న సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు ఎస్ వరలక్ష్మి.



భారత రాజ్యాంగం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు సంతకాల సేకరణ

మనువాద మతోన్మాదం నుంచి భారత రాజ్యాంగాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలనే డిమాండ్‌తో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నాయకులు చేపట్టారు. కోట్లాది మంది సంతకాలతో రాష్ట్రపతికి వినతిపత్రం ఇచ్చేందుకు ఈ నెల 4న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, రాష్ట్ర నాయకులు నటరాజ్, జి క్రాంతికుమార్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి వెంకటేశ్వరరావు తదితరులు సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఖజానాపై 'పిడి' ఖాతాల భారం

- ఆర్థికశాఖపై పెరుగుతున్న వత్తిళ్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పబ్లిక్ డిపాజిట్ (పిడి) ఖాతాలు ఖజానాకు పెను భారంగా మారుతున్నాయి. ఈ ఖాతాల నుంచి అనధికారికంగా తీసుకున్న నిధులను తిరిగి వెనుకకు ఇవ్వడం ఆర్థికశాఖకు తలనొప్పిగా మారుతోంది. ఈ నిధులకు అసలు వాయిదాలు పక్కనపెడితే కనీసం వడ్డీని కూడా చెల్లించే పరిస్థితి లేకుండా పోతోందని అధికారులే వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పిడి ఖాతాల ద్వారా ప్రభుత్వానికి నిధులు ఇచ్చిన సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని వివిధ సంస్థలు తమతమ అవసరాలకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాలను తీసుకోవడం ఆనవాయితీ. అయితే కొద్దికాలంగా ప్రభుత్వం కూడా తమ దైనందిక అవసరాలు తీర్చుకునేందుకు కావాల్సిన నిధులకు కూడా ఈ సంస్థలపైనే ఆధారపడుతోంది. సంస్థలకు గ్యారంటీలు ఇస్తూ రుణాలు తీసుకునేలా ప్రోత్సహించడం, అలా తీసుకున్న రుణాలను పిడి ఖాతాల ద్వారా తిరిగి తీసుకోవడం ఎక్కువైంది. పిడి ఖాతాల్లోకి జమైన రుణాలను ప్రభుత్వం తన అవసరాలకు వినియోగించుకుంటోంది. ప్రధానంగా ఎక్కువగా విద్యుత్ రంగ సంస్థల నుంచే ఈ నిధులను పిడి ఖాతాల ద్వారా సేకరించడం గమనార్హం. పౌర సరఫరాల సంస్థ, నీటిపారుదలాభివృద్ధి సంస్థ వంటి ఇతర సంస్థల నుంచి కూడా వేలాది కోట్లు పిడి ఖాతాల ద్వారా సేకరించడం జరుగుతోంది. అయితే ఇలా తీసుకున్న నిధులను సకాలంలో తిరిగి ఆయా సంస్థలకు మాత్రం చెల్లించలేకపోతున్నారు.

తీసుకున్న రుణాలను తిరిగి రుణదాతలకు చెల్లించాల్సిన బాధ్యత ఆయా సంస్థలదే. అయితే ఆయా సంస్థలు తీసుకున్న రుణాల నిధులు ఆర్థికశాఖ వద్దనే ఉండిపోవడంతో రుణాలిచ్చిన వారికి అసలు వాయిదాలు కూడా చెల్లించలేని పరిస్థితికి సంస్థలు చేరుకుంటున్నాయి. దీంతో కనీసం వడ్డీ అయినా చెల్లించాలని రుణాలిచ్చిన వారు వత్తిడి చేస్తున్నారు. ఇదే అంశాన్ని అప్పు తీసుకున్న సంస్థలు ఆర్థికశాఖ దృష్టికి తీసుకువెళ్తూ తామిచ్చిన నిధులను వాపసు ఇవ్వాలంటూ అడుగుతున్నారు. పదేపదే లేఖలు రాస్తుండగా, అడపాదడపా మాత్రమే కొంత నిధులను విదిలిస్తున్నారన్న విమర్శలు కూడా పెరుగుతున్నాయి. ఇదే సమయంలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, నబార్డ్, గ్రామీణ విద్యుదీకరణ సంస్థ వంటివి నేరుగా రాష్ట్ర ప్రభుత్వంపైనే వత్తిడి చేస్తూ లేఖలు రాస్తున్న వైనం కూడా కనిపిస్తోంది.

కమ్యూనిస్టులను కొనే వారు పుట్టలేదు

- 'సజ్జల' క్షమాపణ చెప్పాలి : ఎమ్మెల్యే కోటంరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసే కమ్యూనిస్టులను కొనేవారు ఇప్పటి వరకు పుట్టలేదని, ఇక పుట్టరని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో టిడిపి, వైసిపి మధ్య రాజకీయ విభేదాలున్నాయని, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారన్నారు. నీతి, నిజాయతీపరులైన కమ్యూనిస్టులపై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కమ్యూనిస్టులకు సజ్జల రామకృష్ణారెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, దేశ, ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులు ఎన్నో త్యాగాలు చేశారని చెప్పారు సిద్ధాంతాలు, త్యాగాలు, నిబద్ధతకు కమ్యూనిస్టులు కట్టుబడి పనిచేస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాపితంగా ప్రజల కోసం పోరాటం చేసే కమ్యూనిస్టులను ఇష్టం వచ్చినట్లు మాట్లాడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు.

జాతీయ భావం పెంపొందాలి

- పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రాంతీయ వాదం పెరగడంతో జాతీయ భావన లేకుండా పోతోందని, ప్రతిఒక్కరిలో జాతీయ భావం పెంపొందించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం మహాత్మాగాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రికి నివాళులర్పించారు. రాష్ట్రంలో పాలకులు అసహనంతో ఎస్‌సి, ఎస్‌టి కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. నాణ్యత లేని మద్యాన్ని అమ్ముతూ డబ్బు దండుకునేందుకు జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు.

అటవీశాఖ క్లియరెన్స్ ఇస్తేనే చిన్నారులకు అనుమతి

- తిరుమలలో క్యూలైన్లను పరిశీలించిన టిటిడి చైర్మన్

ప్రజాశక్తి- తిరుమల

అలిపిరి నుంచి తిరుమలకు నడిచి వచ్చే మార్గంలో వన్యమృగాల నుంచి ఎలాంటి ముప్పు లేదని అటవీశాఖ అధికారులు ధ్రువీకరిస్తేనే 12 ఏళ్ల లోపు పిల్లల విషయంలో ఆంక్షలు సడలిస్తామని టిటిడి చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి తెలిపారు. యాత్రికుల భద్రతే తమకు ముఖ్యమని అన్నారు. యాత్రికుల రద్దీ నేపథ్యంలో క్యూలైన్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఆహారం, తాగునీరు, కాఫీ, టీ, మజ్జిగ అందుతున్నాయా? లేదా? అని యాత్రికులను అడిగి తెలుసుకున్నారు. గోగర్భం సర్కిల్ నుండి కృష్ణతేజ సర్కిల్ వరకు క్యూ లైన్లను పరిశీలించారు. యాత్రికులు త్వరగా శ్రీవారిని దర్శించుకునేందుకు విఐపి బ్రేక్, సుపథం, స్లాటెడ్ దర్శనం టోకెన్ల జారీని రద్దు చేశామని చెప్పారు. అక్టోబరు 15 నుంచి జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో యాత్రికులు హాజరవుతారనే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంటున్నామని తెలిపారు. ఆయన వెంట జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్‌వి నరసింహ కిషోర్, డిప్యూటీ ఇఒ రాజేంద్ర తదితరులు ఉన్నారు.

సంపాదకీయం


మణిపూర్ వెళ్లరేం?

మణిపూర్‌లో గిరిజన తెగల మధ్య ఐదు మాసాల కిందట ఎగసిన హింసాత్మక మంటలు రావణకాష్టంలా రగులుతూనే వున్నాయి. మన దేశాన్నే కాదు ప్రపంచాన్ని సైతం మణిపూర్ నరమేధం దిగ్భ్రమగొల్పుతుండగా ప్రధాని నరేంద్ర మోడీ అటుకేసి కన్నెత్తి చూడకపోవడం, ఆ రాష్ట్రంలో కాలూని ప్రజలను ఓదార్చి కేంద్రం తరఫున వారిలో ఆత్మవిశ్వాసం కల్పించేందుకు సుతరాం ఇష్టపడకపోవడం దారుణం. ఈ కాలంలో ప్రధాని కాలు కదపకుండా ఢిల్లీలోనే పాతుకొని కూర్చున్నారా అంటే అదేమీ లేదు. దేశాలు చుట్టి వచ్చారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలున్న రాష్ట్రాల్లో అధికారం కోసం కాలికి బలపం కట్టుకొని తిరుగుతున్నారు. వాస్తవానికి ఈ ఏడాది మే 3న మణిపూర్‌లో ఘర్షణలు చెలరేగగా ఆ సమయంలో జరిగిన కర్ణాటక ఎన్నికల్లో బిజెపి విజయం కోసం కలియ తిరిగారు. మొన్న శనివారం ఛత్తీస్‌గఢ్‌లో పార్టీ ర్యాలీలో పాల్గొన్నారు. తెలంగాణలో ఆదివారం బహిరంగసభకు హాజరై పలు హామీలిచ్చి బిజెపిని గెలిపించాలని ఓట్లడిగారు. కానీ 'డబుల్ ఇంజన్' సర్కారు అంటూ ఊదరగొట్టే మోడీకి, బిజెపి ఏలుబడిలో దమనకాండ సాగుతున్న మణిపూర్‌లో పాదం మోపడానికి మాత్రం మనసు రాకపోవడంతో అక్కడి దుర్మార్గాలకు కేంద్రం ప్రోత్సాహం, మద్దతు దండిగా ఉందన్న విమర్శలు నిజమని నమ్మాల్సి వస్తుంది.

మణిపూర్ అగ్ని కీలలపై తొలి నుంచీ మోడీ ప్రవర్తనలో కర్కశమే తాండవిస్తోంది. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు మొత్తం ఆ అంశంపైనే స్తంభించాయి. కేంద్ర ప్రభుత్వాధినేత హోదాలో పార్లమెంట్‌కు జవాబుదారీగా వ్యవహరించాల్సిన ప్రధాని మోడీ సభలో తొలుత నోరు మెదపలేదు. మణిపూర్ కల్లోలం తలెత్తిన 77 రోజుల తర్వాత అదీ పార్లమెంట్ వెలుపల ముక్తసరిగా విచారం తెలిపారు. పార్లమెంట్‌కు ప్రధానిని రప్పించి మౌన భగ్నం కావించేందుకు విపక్షాలు ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టాల్సి వచ్చింది. అప్పుడూ మణిపూర్ ప్రజలకు గట్టి భరోసా ఇవ్వలేదు. హింసను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైన, మెజార్టీ తెగకు కొమ్ముకాసిన ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్‌ను తొలగించాలన్న డిమాండ్‌ను తిరస్కరించారు. దాంతో అక్కడి ఘోరాలకు పరోక్ష మద్దతు పలికినట్లయింది. అనంతరమూ మణిపూర్‌లో హింస ఆగలేదు సరికదా భీతికొల్పే ఉదంతాలు బయటికొస్తున్నాయి. హింసాత్మక కార్యకలాపాలను అణచివేయడంలో ప్రఖ్యాతిగాంచిన కేంద్ర పారామిలటరీ దళం అస్సాం రైఫిల్స్‌పై మైనార్టీ తెగ పక్షం వహిస్తున్నదంటూ బీరేన్ సర్కారు కేసు పెట్టిందంటే పరిస్థితి ఎంత వరకూ వచ్చిందో, అక్కడి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వ వత్తాసు ఏ స్థాయికి చేరిందో అర్థమవుతుంది.


మణిపూర్‌లో పౌర సమాజం నిలువునా చీలిపోయింది. మైదాన ప్రాంత గిరిజన తెగ మెయితీ, కొండ కోనల్లో నివసించే కుకీ తెగల మధ్య సాయుధ ఘర్షణలు సాగుతున్నాయి. మహిళలు, చిన్నారుల లక్ష్యంగా హింస ప్రేరేపితమవుతోంది. సామూహిక లైంగిక దాడులు, గ్యాంగ్ రేప్‌లు, మహిళలను నగ్నంగా వీధుల్లో ఊరేగించడాలు, కొట్టి చంపడం, గృహ దహనాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. 200 మంది చనిపోయారు. ఎంతోమంది గాయాలపాలయ్యారు. వేలల్లో నిరాశ్రయులై క్యాంపుల్లో తలదాచుకుంటున్నారు. పోలీసుల చేతుల్లో నుంచి మాయమైన తుపాకులు ఘర్షణలకు ఉపకరిస్తున్నాయంటే కచ్చితంగా రాజ్యం ప్రేరేపితంగానే చూడాలి. నిజనిర్ధారణ చేసిన ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ అక్కడ మానవ హక్కుల్లేవని ఆందోళన వెలిబుచ్చింది. విశ్వగురుగా చెప్పుకునే మోడీకి మాత్రం ఇవేమీ కనిపించట్లేదు, వినిపించట్లేదు. మణిపూర్ ఈ దేశంలో లేదన్నట్లు, ఆ రాష్ట్రానికి తాను ప్రధాని కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇంఫాల్ లోయ మినహా రాష్ట్రం మొత్తాన్నీ కల్లోలిత ప్రాంతంగా ప్రకటించారు. ఇంకో ఆర్నెల్లపాటు సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. కొన్ని నెలల తర్వాత ఇంటర్నెట్‌ను పునరుద్ధరించి 48 గంటలు గడవకముందే నిలిపేశారు. పరిస్థితి అదుపులోకొస్తోందని 60 వేల కేంద్ర బలగాలను మోహరించిన అమిత్‌షా చెప్పగా పరిస్థితి చక్కబడింది లేదు. ఈ పర్యవసానాలన్నీ మణిపూర్ మంటలకు దోషిగా కేంద్ర బిజెపినే చూపుతున్నాయి.

మంచి మాట



శరీరం బలహీనపడినప్పుడు అసూయ లాంటి వ్యాధులు మరింత పెరుగుతాయి.


- విలియం షేక్‌స్పియర్,
ప్రపంచ ప్రసిద్ధ రచయిత.



కార్పొరేట్ల లాభాల కోసం అడవుల విధ్వంసం

ఈ మోడీ ప్రభుత్వం నిరంతరం కార్పొరేట్ల ప్రయోజనాలను నెరవేర్చడం కోసం పనిచేస్తూ వుంటుంది. ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగంలో, ఇతర రంగాలలో ఉన్న కార్పొరేట్లు ప్రాజెక్టులు చేపట్టి లాభాలను పిండుకోవడం కోసం దేశంలోని విస్తారమైన అటవీ ప్రాంతాలను నాశనం చేయడానికి అనుమతిస్తోంది. అందుకోసం అటవీ సంరక్షణ చట్టానికి సవరణలు తెస్తోంది. తద్వారా ప్రభుత్వ సంరక్షణలో ఉండే కొన్ని అటవీ ప్రాంతాలను ఇకముందు అడవులుగా పరిగణించకుండా అటవీ సంరక్షణ చట్టం పరిధిలోంచి తొలగించనుంది.

1996లో సుప్రీం కోర్టు ఒక తీర్పు వెలువరించింది. దాని ప్రకారం అటవీ ప్రాంతంగా ఉన్న భూమిని, అది ఎవరి స్వాధీనంలో ఉన్నప్పటికీ, దానిని ప్రభుత్వ రికార్డుల్లో అటవీ ప్రాంతంగా నమోదు చేయకపోయినప్పటికీ, ప్రభుత్వం సంరక్షించాల్సిందే. ప్రభుత్వ రికార్డులు అటవీ ప్రాంతాలను నమోదు చేయడంలో ఘోరంగా వెనుకబడ్డాయి. అడవి అనే నిర్వచనమే చాలా అస్పష్టంగా ఉంది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉంది. అందువలన సుప్రీం కోర్టు ప్రతీ రాష్ట్రంలోనూ ఒక నిపుణుల కమిటీని నియమించాలని, రికార్డుల్లో లేని అన్ని అటవీ ప్రాంతాలనూ గుర్తించాలని, వాటన్నింటికీ అధికారికంగా అటవీ ప్రాంతాలుగా గుర్తింపునివ్వాలని, అప్పుడే వాటిని చట్ట ప్రకారం సంరక్షించడం సాధ్యపడుతుందని ఆ తీర్పులో ఆదేశించింది.



ప్రభాత్ పట్నాయక్

ఈ తీర్పు వచ్చిన 18 సంవత్సరాల తర్వాత కూడా, అంటే 2014 నాటికి కూడా హర్యానా, బీహార్, గుజరాత్, మహారాష్ట్ర వంటి పలు రాష్ట్రాల ప్రభుత్వాలు అటవీ ప్రాంతాలను గుర్తించడానికి కాని, వాటిని ప్రభుత్వ రికార్డులలో తగు విధంగా నమోదు చేయడానికి గాని ఏ విధమైన చర్యలూ తీసుకోలేదు. ఈ సంగతి ఒక పాత్రికేయుల బృందం చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ఈ లొసుగుని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఉపయోగించుకుంటోంది. ఏకంగా చట్టానికే సవరణలు తెచ్చి రికార్డులకెక్కని అటవీ భూములకు ప్రభుత్వ సంరక్షణ లేకుండా చేస్తోంది.

ఇది సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే. నిజానికి కేంద్రం ఇంతవరకూ సుప్రీంకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేసిన రాష్ట్రాలను హెచ్చరించి ఆ తీర్పు అమలు జరిగేలా చూసి వుండాలి. లేదా కేంద్ర ప్రభుత్వమే ఒక నిపుణుల కమిటీని నియమించి అన్ని రాష్ట్రాలలోనూ నమోదు కావలసిన అటవీ ప్రాంతాలను గుర్తించి అవి ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయాలని ఆ యా రాష్ట్రాలను ఆదేశించి వుండాల్సింది. అలా చేయకపోగా, రాష్ట్ర ప్రభుత్వాల అలసత్వాన్ని సాకుగా తీసుకుని సుప్రీం కోర్టు తీర్పునే రద్దు చేసేలా చట్ట సవరణకు సిద్ధం కావడం మోడీ ప్రభుత్వ తెంపరితనానికి నిదర్శనం.

సుప్రీంకోర్టు ఉత్తర్వుల కారణంగా తమ నిర్వహణలో ఉన్న తోటలను కూడా అడవులుగా గుర్తించే అవకాశం ఉందని ప్రైవేటు యజమానులు భయపడుతున్నారని, తమ భూములను తమకు నచ్చిన విధంగా వినియోగించుకునే హక్కు కోల్పోతామని వారు భావిస్తున్నారని, అందువలన ప్రైవేటు తోటల విస్తరణ ఆగిపోయిందని, దాని ఫలితంగా పచ్చదనం దెబ్బ తింటోందని, ప్రైవేటు యజమానుల భయాలను పోగొట్టి పచ్చదనాన్ని విస్తరించడానికే ఈ సవరణ తీసుకువస్తున్నామని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ తమ చర్యను సమర్థించుకున్నారు.

ఇది అందరినీ తప్పుదోవ పట్టించే వాదన. మొదటి విషయం: అడవుల, తోటల విస్తీర్ణం పెరగకపోడానికి ఒక కారణాన్ని అది ముందుకు తెచ్చింది. తోటలు పెంచుతున్న, పెంచాలని అనుకుంటున్న ప్రైవేటు యజమానుల మనసుల్లో భయాలు ఏర్పడ్డాయన్నదే ఆ కారణం. అటువంటిది వాస్తవంగా ఉందో, లేదో, ఉంటే ఎక్కడెక్కడ, ఎవరెవరికి ఉందో చెప్పగల గణాంకాలు ప్రభుత్వం దగ్గర ఉండాలి. దానిమీద ఎటువంటి స్వతంత్ర అధ్యయనమూ లేదు, ఆధారాలూ లేవు. రెండవ విషయం: ఒకవేళ ప్రైవేటు యజమానులకు ఆ విధమైన భయాలు నిజంగా ఉన్నా, అడవులకు, తోటలకు మధ్య తేడాను స్పష్టంగా తెలియజెప్పే విధంగా నిర్వచించడమే దానికి పరిష్కారం ఔతుంది. అలా చేయడం పోయి ఏకంగా చట్టాన్నే మార్చేయవలసిన అగత్యం ఏముంది? ఇక్కడ ప్రభుత్వ ఉద్దేశ్యం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. అడవీ ప్రాంతాలను సంరక్షించడం కాదు దాని లక్ష్యం. విస్తారమైన అటవీ ప్రాంతాలను వ్యాపారానికి అనువుగా మార్చివేయడమే.

అలా గనుక జరిగితే పర్యావరణానికి కలిగే నష్టం అపారంగా ఉంటుంది. ఇప్పటిదాకా, దేశంలో అటవీ భూముల విస్తీర్ణం వాస్తవంగా ఎంత ఉందో ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. అందులో ఎంతమేరకు ఇప్పుడు వ్యాపారానికి అనువుగా మార్చబోతున్నారో అంచనా వేయడం సాధ్యం కావడం లేదు. ఐతే ఈ రంగంలోని నిపుణులు మాత్రం గణనీయమైన అటవీ ప్రాంతాన్ని కోల్పోనున్నామని హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు హర్యానా రాష్ట్ర పరిధిలోకి వచ్చే ఆరావళీ పర్వత శ్రేణికి చెందిన అటవీ ప్రాంతం అధికారికంగా అడవిగా నమోదు కాలేదు. ఆ ప్రాంతం దేశ రాజధానికి దగ్గర్లో ఉంది. అందుచేత ఆ ప్రాంతంమీద చాలామంది రియల్టర్ల కన్ను పడింది. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని వ్యాపారాలకు వినియోగించడం జరిగితే దేశ రాజధాని ప్రాంతంలో అత్యంత ఆవశ్యమైన పచ్చదనం కాస్తా కనుమరుగౌతుంది.



పర్యావరణానికి కలిగే అపార నష్టంతోబాటు ఆ అడవుల మీద ఆధారపడి తమ జీవనాన్ని కొనసాగిస్తున్న ప్రజల గతి ఏమౌతుంది? అడవుల్లో చిన్న తరహా అటవీ ఉత్పత్తులను సేకరించి తమ జీవనాన్ని వెళ్ళదీస్తున్నవారు చాలామంది ఉన్నారు. ఆ అడవులు ధ్వంసం అయితే వారి జీవనోపాధి ఏమౌతుంది? వారికి ప్రభుత్వం ఏ ప్రత్యామ్నాయాన్నీ చూపించకుండా అడవులను ధ్వంసం చేయడానికి అనుమతిస్తే అది వారందరి జీవితాలనూ నాశనం చేయడమే ఔతుంది. ఉమ్మడి సంపదను కొందరు కొల్లగొట్టి పోగేసుకునే "ఆదిమ సంచయం" ఫలితంగా అనేకుల జీవితాలు విధ్వంసం అవుతాయని మార్క్స్ చెప్పాడు. ఇప్పుడు అదే జరుగుతోంది. పలు దళిత, గిరిజన సంఘాలు మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన చట్ట సవరణను బలంగా వ్యతిరేకించడంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు.

అటవీ భూములను ప్రైవేటీకరించే ఈ ప్రయత్నం ఒక పెద్ద సవాలును ముందుకు తెచ్చింది. అది కేవలం అడవీ భూములకు సంబంధించినదే కాదు, మొత్తం భూమికి సంబంధించినది. మన దేశంలో భూమి కొరత చాలా ఉంది. అంతే కాదు, ఆ కొరతను భర్తీ చేయడం కూడా అసాధ్యం.

> **ప్రస్తుతం మన దేశంలో భూ వినియోగం విషయంలో ప్రైవేట్ కార్పొరేట్ల ప్రయోజనాలు సామాజిక ప్రయోజనాలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయి. ఇప్పుడు రియల్ ఎస్టేట్ మార్కెట్ అవసరాల కోసం, గోల్ఫ్ కోర్సుల కోసం చాలా ఎక్కువమంది పేదలు నివసిస్తున్న భూములను ఖాళీ చేయిస్తున్నారు. స్వల్ప సంఖ్యలో ఉండేవారికోసం అధిక సంఖ్యాకుల ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నారు.**

అటువంటప్పుడు ఆ పరిమితమైన భూమిని ఏ విధంగా వినియోగిస్తున్నారు అనేది ఉపాధి, ఆహార భద్రత, తదితర సామాజిక లక్ష్యాలపై ప్రభావం చూపుతుంది. ఆ లక్ష్యాలను సాధించడంలో భూమి వినియోగం కీలకం ఔతుంది. అందుచేత అటువంటి కీలకమైన భూమి వినియోగాన్ని ప్రైవేటు వ్యక్తుల ఇష్టాలకు వదిలిపెట్టకూడదు. భూమిని మొత్తంగా సమాజపరం చేయలేకపోవచ్చు. కాని భూ వినియోగాన్ని మాత్రం సామాజికంగా నియంత్రించాల్సిందే. వరిసాగులో ఉన్న భూములను ఇతరత్రా వినియోగించడాన్ని నియంత్రిస్తూ కేరళ రాష్ట్రంలో చేసిన చట్టం వెనుక ఉన్న తర్కం ఇదే.

దీనర్థం ఏమిటి? ఒకరివద్ద నుండి మరొకరు కొంత భూమిని కొంటున్నప్పుడు ఆ లావాదేవీని అనుమతించాలంటే ఒక షరతు విధించాలి. ఆ భూమి చేతులు మారాక దాని వినియోగం మారితే (పంట పొలంగా ఉన్నది కాస్తా ఇళ్ళ నిర్మాణానికో, ఫ్యాక్టరీ కట్టడానికో ఉపయోగిస్తే) అలా మారిన వినియోగం సమాజానికి ఆమోదయోగ్యంగా ఉండాలి అన్నదే ఆ షరతు. ఈ సూత్రాన్ని అనుసరించే 1996లో సుప్రీం కోర్టు అటవీ భూములను వేరే విధంగా వినియోగించడాన్ని నిరోధిస్తూ తీర్పు చెప్పింది. పర్యావరణ రక్షణ దృష్ట్యా, స్వేచ్ఛా మార్కెట్ (కార్పొరేట్లను) కార్యకలాపాలను నియంత్రించడం అవసరమేనని అందరూ ఒప్పుకుంటారు. కాని మొత్తం సమాజం ప్రయోజనాలను కాపాడాలంటే ప్రైవేట్ కార్పొరేట్ల ప్రయోజనాలను నియంత్రించాల్సిందే అన్న సాధారణ సూత్రంలో ఇదొక అంతర్భాగమేనని అందరూ గమనించాలి.

ప్రస్తుతం మన దేశంలో భూ వినియోగం విషయంలో ప్రైవేట్ కార్పొరేట్ల ప్రయోజనాలు సామాజిక ప్రయోజనాలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయి. ఇప్పుడు రియల్ ఎస్టేట్ మార్కెట్ అవసరాల కోసం, గోల్ఫ్ కోర్సుల కోసం చాలా ఎక్కువమంది పేదలు నివసిస్తున్న భూములను ఖాళీ చేయిస్తున్నారు. స్వల్ప సంఖ్యలో ఉండేవారికోసం అధిక సంఖ్యాకుల ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నారు.

ఇప్పుడు దేశంలో భూ వినియోగాన్ని సామాజిక ప్రయోజనాల దృష్ట్యా నియంత్రించడానికి ఏ విధమైన పద్ధతులను ప్రవేశ పెట్టాలన్న ప్రశ్న మనల్ని వెనక్కి లాగేయకూడదు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి మార్కెట్‌లో అమ్మకానికి వచ్చే ఏ భూమినైనా మొదట ఆ కార్పొరేషన్‌కే అమ్మజూపాలి అన్న నిబంధన విధించాలి. అప్పుడు ఆ కార్పొరేషన్ ఆ భూమిని కొని దానిని తిరిగి మరొకరికి అమ్మేటప్పుడు ఆ కొనుగోలుదారులు దాన్ని సామాజికంగా ఆమోదయోగ్యంగా ఉండే విధంగా వినియోగించే షరతును అమలు చేయగలుగుతుంది. లేదా, నేరుగానే ఇద్దరు వ్యక్తుల మధ్య భూ లావాదేవీ జరిగినప్పుడు దానిని కొనేవారు సామాజికంగా ఆమోదయోగ్యమైన రీతిలోనే వినియోగించాలన్న షరతును విధించవచ్చు. ఆ షరతును ఉల్లంఘిస్తే భారీ జరిమానా విధించవచ్చు.

ఐతే ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఇందుకు పూర్తి వ్యతిరేక దిశలో అడుగులు వేస్తోంది. మార్కెట్ అవసరాలకు (కార్పొరేట్ల అవసరాలకు) అనుగుణంగా భూ వినియోగాన్ని మార్చే పనిలో ఉంది. పెట్టుబడి ఆదిమ సంచయంతో ఇటువంటి మార్పులే జరుగుతాయి. భూమితో సహా అన్ని సంపదలూ సమిష్టిగా అనుభవిస్తున్నవిగాని, చిన్న చిన్న యజమానులు అనుభవిస్తున్నవి గాని కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లో చిక్కడమే కాకుండా, ఆ సంపదల వినియోగం తీరు కూడా మారిపోతుంది. చిన్న చిన్న రైతుల చేతుల్లో ఉండే భూమి కాస్తా కొద్దిమంది కార్పొరేట్ల పాలైతే అప్పుడు అక్కడ చిన్న తరహా ఉత్పత్తి విధానం పోయి, భారీ స్థాయి సరుకుల ఉత్పత్తి మొదలౌతుంది.

నల్ల వ్యవసాయ చట్టాలు ఈ లక్ష్యం కోసమే రూపొందాయి. తమ తమ స్వంత వినియోగం కోసం గాని, ఎఫ్‌సిఐ ద్వారా దేశ ఆహార అవసరాలను తీర్చడం కోసం గాని ప్రధానంగా పంటలు పండించే చిన్న రైతుల నుండి భూమి కార్పొరేట్ల పరం చేసి సంపన్న పెట్టుబడిదారీ దేశాల అవసరాలను తీర్చే వాణిజ్య పంటలు పండించడానికి ఆ చట్టాలు తోడ్పడతాయి. ఇప్పుడు అటవీ సంరక్షణ చట్టానికి చేస్తున్న సవరణ కూడా అటవీ భూముల వినియోగాన్ని మార్చి స్వదేశీ, విదేశీ సంపన్నుల అవసరాల కోసం మళ్ళించడానికే ఉపయోగపడుతుంది. ఆ అడవుల మీద ఆధారపడి జీవిస్తున్న ఆదివాసులను అడివికి దూరం చేస్తుంది.

(స్వేచ్ఛానుసరణ)

> **మోడీ ప్రభుత్వం మార్కెట్ అవసరాలకు (కార్పొరేట్ల అవసరాలకు) అనుగుణంగా భూ వినియోగాన్ని మార్చే పనిలో ఉంది. పెట్టుబడి ఆదిమ సంచయంతో ఇటువంటి మార్పులే జరుగుతాయి. భూమితో సహా అన్ని సంపదలూ సమిష్టిగా అనుభవిస్తున్నవిగాని, చిన్న చిన్న యజమానులు అనుభవిస్తున్నవి గాని కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లో చిక్కడమే కాకుండా, ఆ సంపదల వినియోగం తీరు కూడా మారిపోతుంది. చిన్న చిన్న రైతుల చేతుల్లో ఉండే భూమి కాస్తా కొద్దిమంది కార్పొరేట్ల పాలైతే అప్పుడు అక్కడ చిన్న తరహా ఉత్పత్తి విధానం పోయి, భారీ స్థాయి సరుకుల ఉత్పత్తి మొదలౌతుంది.**

పోరుబాట

పాలకుల నిర్లక్ష్యంతో 'ప్రకాశం'లో దుర్భిక్షం...



> **ప్రకాశం జిల్లా లోని శ్రమజీవుల్లో 2 లక్షల మంది నిత్యం వలసల్లోనే వుంటున్నారు. భవన నిర్మాణ, వ్యవసాయ పనుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారు. పట్టుమని వెయ్యి మందికి ఉపాధి కల్పించే ప్రభుత్వ రంగ పరిశ్రమ ఒక్కటీ లేదు. నేటికీ యూనివర్శిటీ లేని జిల్లా ఇది. విద్య, ఉపాధి, వైద్యం కోసం వలసలే గతి. సగానికిపైగా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్ళవు. తాగు నీరే కాదు, అనేక గ్రామాలలో వాడుకునే నీరు కూడా కొనుక్కోవాల్సిన దయనీయ స్థితి.**

ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని, జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటించాలనే ప్రధాన డిమాండ్‌తో సిపిఐ(యం) పోరుబాట పాదయాత్ర (సెప్టెంబర్ 10-23) సాగించింది. ఈ యాత్ర ద్వారా ప్రజల కష్టాలు, కడగండ్లు, వనరులున్నా వినియోగంలోకి తీసుకురాని పాలకుల నిర్లక్ష్యం, నిత్యం కరువు కాటకాలు, వలసలతో గడుస్తున్న బడుగుల జీవితాలు, వారి బిడ్డలను సాకుతున్న అవ్వలు, తాతల యాతనను చూసి పాదయాత్ర బృందానికి గుండెలు బరువెక్కాయి.

'ప్రకాశం'ను వెనుకబడిన జిల్లాగా ప్రకటించాలని సిపిఐ(యం) 2016 నుండి నిరంతర ఉద్యమాలు సాగిస్తున్నది. ఆ కేసులు నేటికీ కొనసాగుతున్నాయి. పాలకులు, జిల్లా ప్రజా ప్రతినిధులు మాత్రం వెనుకబాటు ఊసే ఎత్తడంలేదు. పదవులు కాదు, ప్రజా సమస్యలు గుర్తించండని పాలకులను ప్రశ్నించాలని ప్రజల్ని మేల్కొల్పేందుకే ఈ పాదయాత్ర సాగింది.

వెనుకబడిన జిల్లాగా గుర్తించటానికి ఇవి చాలవా?



కంకణాల ఆంజనేయులు

జిల్లాలో వర్షపాతం సహజంగానే తక్కువ. అత్యధిక సాగుభూమి వర్షాధారమే. జిల్లా ఏర్పడిన ఈ 53 ఏళ్ళకాలం లో 38 సంవత్సరాలు తగిన వర్షాలు లేవని కేంద్ర ప్రభుత్వమే కరువు జిల్లాగా ప్రకటించింది. మరో ఐదారేళ్ళు భారీ వర్షాలు, వరదలతో పంటలు లేక, పనులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ప్రభుత్వ రికార్డులే చెబుతున్నాయి.

ఇవి చాలవా వెనుకబడిన జిల్లాగా ప్రకటించటానికి. అక్షరాస్యత రాష్ట్రంలో 67 శాతం వుంటే జిల్లాలో 63 శాతం. మహిళలు, దళిత, గిరిజనుల్లో ఇది మరీ తక్కువ. జిల్లా లోని శ్రమజీవుల్లో 2 లక్షల మంది నిత్యం వలసల్లోనే వుంటున్నారు. భవన నిర్మాణ, వ్యవసాయ పనులకు సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారు. పట్టుమని వెయ్యి మందికి ఉపాధి కల్పించే ప్రభుత్వ రంగ పరిశ్రమ ఒక్కటీ లేదు. నేటికీ యూనివర్శిటీ లేని జిల్లా ఇది. విద్య, ఉపాధి, వైద్యం కోసం వలసలే గతి. సగానికిపైగా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్ళవు. తాగునీరే కాదు, అనేక గ్రామాలలో వాడుకునే నీరు కూడా కొనుక్కోవాల్సిన దయనీయ స్థితి.

వనరుల్ని ఒడిసిపట్టే నాథుడేడి?

జిల్లాలో గుండ్లకమ్మ, మూసి, పాలేరు, మన్నేరు, అట్లేరు, తీగలేరు, సగిలేరు లాంటి నదులతోపాటు, అనేక వాగులు, వంకల ద్వారా వర్షం కురిసినప్పుడు వృథాగా సముద్రం పాలౌతున్న నీరు 55 టి.యం.సి.లు వుంటుందని నిపుణులు చెబుతున్నారు. వాటికి చెక్‌డ్యామ్‌లు, ఆనకట్టలు, రిజర్వాయర్లు ఏర్పాటు చేసి ఒడిసిపట్టే ఆలోచన చేయని పాలకుల నిర్లక్ష్యం వల్ల నిత్యం నీటికరువు ఏర్పడుతున్నది. పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి వెలుగొండ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో అంతుబట్టటం లేదు. లోపల వున్న నిర్వాసిత ప్రాంతాల్లో మౌలిక వసతులు పాతికేళ్ళుగా నిలిచిపోయాయి. వారి బాధ వర్ణనాతీతం. దొనకొండ మండలం కొచ్చర్లకోట వద్ద గుండ్లకమ్మపై చెక్‌డ్యాం నిర్మించడం ద్వారా 7 చెరువులకు నీరు చేరితే...సగం మండలం ప్రజల అవసరాలు తీర్చే అవకాశం వుంది. దానికి రూ.15 కోట్లు కేటాయిస్తే చాలు. చీమకుర్తి వద్ద యస్.యస్.పి. కాలువ కారుమంచి మేజర్‌కు గండిపడి 25 గ్రామాలకు చెందిన పంటలు ఎండిపోతున్నా పట్టించుకున్న దిక్కు లేదు. సంగమేశ్వరం ప్రాజెక్టు రూ.50.55 కోట్ల అంచనాతో ప్రారంభమైంది. ఒక గొయ్యి మాత్రమే తీశారు. నేడు అది పూర్తికావడానికి రూ.206 కోట్లు కావాలట. గుండ్లకమ్మ ప్రాజక్టు గేట్లు కొట్టుకొని పోయి ఏడాది దాటింది. 3.87 టి.యం.సిల నీరంతా సముద్రం పాలౌతున్నా ప్రభుత్వానికి పట్టలా. 42 గ్రామాలు, జిల్లా కేంద్రానికి తాగునీరు, 80 వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టుపట్ల పాలకుల తీరిది. పాలేటిపల్లి రిజర్వాయర్ కాల్వల పని మొదలేకాలేదు. రామతీర్థం జలాశయం ఆశయం నెరవేరేదెప్పుడో? మొగిలి గుండాల చెరువు, ఎర్ర ఓబనపల్లె లిఫ్టు, కంభం చెరువు, కాల్వల పూడిక తొలిగింపు, కోటకట్ట చెరువు, మోపాడు రిజర్వాయర్ తదితర మధ్యతరహా నీటి వనరుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికార పార్టీల నేతలు ట్యాంకర్ల ద్వారా నీరు తోలుతూ తమ స్వార్ధ ప్రయోజనాలు నెరవేర్చుకుంటున్నారు తప్ప, ప్రజల గొంతు తడిపే శాశ్వత ఆలోచనలు చేయడం లేదు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన గెలాక్సీ గ్రానైట్, పలకల పరిశ్రమలు ప్రభుత్వాల పన్నుల భారంతో సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ఉన్న ఉపాధి కాస్తా అడుగంటుతున్నది. పండ్ల తోటల ఆధారంగా జ్యూస్ ఫ్యాక్టరీలు, కోస్తా ప్రాంతంలోని ఇసుక ఆధారంగా పింగాణి పరిశ్రమ, సుబాబుల్, జామాయిల్ కర్రతో పేపర్ మిల్లు, 4 వేల ఎకరాల వ్యాన్‌పిక్‌లో పరిశ్రమలు, దొనకొండ మండలంలోని 25,856 ఎకరాల పడావు భూముల్లో పారిశ్రామిక కారిడార్, పామూరు, పి.సి.పల్లి మండలాల్లో 14,231 ఎకరాల్లో 'నిమ్జ్' ఏర్పాటు ద్వారా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తామన్న మాటలు నీటిమూటలయ్యాయి.

రైతు-కూలీల దుస్థితి

కొలభీమునిపాడులో రూ.1200 ఖర్చు చేసి బీరకాయ విత్తనాలు తెచ్చి పంట వేస్తే చీడ అంటుకుని రూ.300 వచ్చాయని ఓ రైతు చెప్పాడు. ఆ పక్క గ్రామంలో గోరుచిక్కుడు ఎకరం వేసిన భార్యాభర్తలిద్దరూ రోజుకు బస్తా కోస్తే కేజీ పది రూపాయల చొప్పున రూ.500 వచ్చాయి. గిట్టుబాటు కాలేదు, కూలి రేటు కూడా రాలేదన్నారు. మిర్చి పంట 1.30 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఎకరాకు సగటున రూ.1.25 లక్షలు ఖర్చవుతున్నది. రేటు నిలకడ లేక అప్పులతో బతుకుతున్నామని వాపోయారు. మిర్చి కొనుగోలు కేంద్రం జిల్లాలో ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని కోరారు. 2 లక్షల ఎకరాలకు పైగా కంది పంట వేస్తున్నారు. తగినన్ని కొనుగోలు కేంద్రాలు లేవు. కొండెపిలో ఏర్పాటు చేయాలని కోరారు. కరివేపాకుకు మద్దతు ధర లేదని చెప్పారు. 2 లక్షల ఎకరాల్లో సాగు కావలసిన వరి పంటకు పాలకులు ఉరివేశారు. దీంతో కూలీల పని దినాలు కూడా క్రమంగా పడిపోతున్నాయి.

జిల్లాలో 1.50 లక్షల వ్యవసాయ కార్మిక కుటుంబాలుండగా వీరిలో 70 శాతం మందికి పైగా సెంటు సాగు భూమి లేదు. జిల్లాలో వున్న 1.30 లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రభుత్వం పేదలకు పంచిన భూమి కూడా పెత్తందార్లు కాజేస్తున్నారు. తాడివారిపల్లిలో 7 దశాబ్దాలుగా 80 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్న పేదలను బలవంతంగా తొలిగించి అక్రమార్కులకు కట్టబెట్టే ప్రయత్నం అధికార పార్టీ నేతలు చేస్తున్నారు. గ్రామీణ ప్రజలకు కొంత ఆసరాగా వున్న ఉపాధి హామీ ఈ కాలంలో గ్రామాల్లోని అధికార పార్టీ నేతల అక్రమాలతో పేదలకు దూరమౌతున్నది. పనుల కోసం అమ్మా, అయ్యా సుదూర ప్రాంతాలకు వలస పోతే బిడ్డల ఆలనా పాలనా బాధ్యత అవ్వాతాతల మీద పడింది. పరిస్థితి అధ్వానంగా మారి చిన్నారుల చదువు చట్టుబండలౌతున్నది. ఇళస్థలాలు, పక్కా గృహాల సమస్య తీవ్రంగా వుంది. 69,539 జగనన్న ఇళ్ళు మంజూరైతే 15,266 పూర్తి అయ్యాయని ప్రభుత్వం చెబుతున్నది. క్షేత్ర స్థాయిలో చూస్తే అత్యధిక ప్రాంతాల్లో నిర్మాణాలు ప్రారంభించక కాలనీ స్థలాలు కంపచెట్లతో నిండి వున్నాయి. 5 పట్టణాల్లో మంజూరైన 24,360 టిడ్కో ఇళ్ళలో 9,508 నిర్మాణంలో ఆగిపోయి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

కన్నీళ్ళు తెప్పిస్తున్న కిడ్నీ బాధితుల గాథలు

ఆహారం లేకపోయినా నీరు తాగి కొంత కాలం బతకొచ్చంటారు. కానీ జిల్లాలోని మూడు వంతుల భూభాగంలో ఫ్లోరిన్ శాతం అధికంగా వున్నందున ప్రజలు ఆ విషపు నీరు తాగి 30 ఏళ్ళకే ముసలోళ్లవుతున్నారు. కిడ్నీ వ్యాధితో కొందరు అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోతున్నారు. కనిగిరి నియోజక వర్గంలో ఫ్లోరిన్ పీడ మరీ అధికం. ప్రస్తుతం ప్రతి గ్రామంలో పదికి తగ్గకుండా వ్యాధిగ్రస్తులు వారానికి రెండుసార్లు కనిగిరి వచ్చి డయాలసిస్ చేయించుకొంటూ జీవచ్ఛవాల్లా వున్నారు.

మౌలిక వసతులు ఏవీ?

నివాస ప్రాంతాల్లో రోడ్లు వేసిన చోట కాల్వలు లేక మురుగు పెరిగి దోమల ఆవాసాలుగా మారాయి. పారిశుధ్యం పడకేసింది. పంచాయతీలు బ్లీచింగ్ చల్లటానికి కూడా నిధులు లేక నీలుగుతున్నాయి. విలేజి హెల్త్ సెంటర్లు పేరుకే పరిమితం అయ్యాయి. ప్రజలు రోగాలతో పెద్దాసుపత్రులకు వెళ్ళి అప్పుల పాలౌతున్నారు. మార్కాపురం మెడికల్ కాలేజి పనులు, నడికుడి శ్రీకాళహస్తి రైల్వే మార్గం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రక్షిత మంచినీటి పథకాలకు ఉద్దేశించిన 28 స్కీములు కదలడం లేదు. కొత్తగా మంజూరైన పథకాల పనులు సాగటం లేదు. ఆసియా లోనే పెద్దదైన పాల పొడి ఫ్యాక్టరీ మూలబడింది. ప్రభుత్వ, సహకార రంగంలోని ప్రకాశం పాల ఉత్పత్తిదారుల సహకార కేంద్రం (పాల డెయిరీ) అమూల్ పరమైంది. దాని భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. పాడి రైతులు జీవితాలు దిక్కుతోచని స్థితిలోకి నెట్టబడ్డాయి. జిల్లా ప్రజల దుర్భర జీవితాలను, వారి దురవస్థలను ప్రత్యక్షంగా చూసిన పాదయాత్ర బృందం...ప్రజా సమస్యల పట్ల పాలకుల నైజాన్ని ప్రశ్నించాలని, పోరాటాల ద్వారానే పథకాలు, చట్టాలు, హక్కులు సాధ్యమౌతాయని తెలియచెప్పే ప్రయత్నం చేసింది. వాటి సాధనకు మరో ఉద్యమం చేపట్టాలని భావించింది.

/వ్యాసకర్త సిపియం ప్రకాశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, సెల్:9490300370/

కులం, మతం పేరుతో చీలుస్తున్నారు

- ఎన్నికల సభలో మోడీ

భోపాల్: కులం, మతం పేరుతో ప్రతిపక్షాలు ప్రజలను చీలుస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆరోపించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో రాష్ట్రానికి సంబంధించి రూ.19,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ.. ప్రతిపక్షాలు అభివృద్ధిని పక్కన పెట్టి, పేదవాళ్ల భావోద్వేగాలతో ఆడుకునేవారని అన్నారు. అప్పుడు కులం పేరుతో సమాజాన్ని చీల్చేవారని, నేడు కూడా అదే చేస్తున్నారని చెప్పారు. సోమవారం బీహార్ ప్రభుత్వం కుల గణనపై సర్వే నివేదికను విడుదల చేసిన తరుణంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాలు కులం, మతం పేరుతో గందరగోళం సృష్టిస్తున్నాయని అన్నారు. దేశ ప్రగతిని ద్వేషించడమే వారి ఏకైక పని అని అన్నారు. మహిళలకు హక్కులు దక్కడం లేదని కాంగ్రెస్, ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తూ.. కులం సాకులు చెబుతూ ప్రచారం చేస్తున్నారని చెప్పారు.

భూవివాదంలో ఆరుగురి హత్య

- యుపిలో మరో ఘోరం

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని డియోరియా జిల్లాలో భూవివాదంలో ఆరుగురు హత్యకు గురయ్యారు. మృతుల్లో ఐదుగురు ఒకే కుటుంబానికి చెందినవారు. ఈ దారుణ సంఘటన డియోరియా జిల్లా ఫతేపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ఫతేపూర్‌లోని ప్రేమ్ యాదవ్, సత్య ప్రకాష్ దూబే కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా భూవివాదం నడుస్తోంది. సోమవారం ఉదయం సత్య ప్రకాష్ దూబే ఇంటికి వెళ్లి ప్రేమ్ యాదవ్ గొడవపడ్డాడు. దూబే, అతని కుటుంబ సభ్యులు ప్రేమ్ యాదవ్‌పై పదునైన ఆయుధంతో దాడి చేసి హత్య చేశారు. దీంతో యాదవ్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు దూబే ఇంటిపై, కుటుంబ సభ్యులపై దాడి చేశారు. దీంతో దూబే కుటుంబంలోని ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుల్ని ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. చికిత్స పొందుతూ ఐదుగురు మరణించారు. మరొకరి పరిస్థితి తీవ్రంగా ఉంది. భూవివాదం కారణంగానే ఈ హత్యలు జరిగాయని జిల్లా ప్రత్యేక డిజిపి (శాంతిభద్రతలు) ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేసినట్లు తెలిపారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు

- కర్ణాటక డిప్యూటీ సిఎం శివకుమార్

బెంగళూర్ : చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కర్ణాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్ తెలిపారు. బెంగళూరులో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. శివమొగ్గలో ఈద్ ఊరేగింపుపై రాళ్ల దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. శాంతిని కోరుకుంటామని, అలాంటి ఘటనలను ప్రోత్సహించబోమని ఆయన తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునేవారిని ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. అంతకుముందు కర్ణాటక సిఎం సిద్ధరామయ్య శివమొగ్గ ఘటనపై వివరణ ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించి 43 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. శివమొగ్గలో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని చెప్పారు. ఘర్షణ నేపథ్యంలో శివమొగ్గ కార్పొరేషన్ పరిధిలో 144వ సెక్షన్ విధించారని తెలిపారు.

సిబిఐ, ఎన్ఐఎ అరెస్టులపై కుకీ గ్రూపుల ఆగ్రహం

- చురాచాంద్‌పూర్‌లో నిరవధిక బంద్ ప్రారంభం

న్యూఢిల్లీ : మణిపూర్‌లో కేంద్ర దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఎన్ఐఎ అరెస్టుల పర్వం అక్కడి కుకీ గ్రూపులో ఆగ్రహాన్ని తెప్పిస్తున్నది. జులై నెలలో అదృశ్యమైన ఇద్దరు విద్యార్థుల మృతి విషయంలో సంబంధం ఉన్నదన్న ఆరోపణలపై కుకీ తెగకు చెందిన నలుగురిని సిబిఐ అరెస్టు చేయటాన్ని కుకీ ప్రజలు తప్పుబడుతున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యకు స్పందనగా కుకీ గ్రూపు చురాచాంద్‌పూర్ జిల్లాలో నిరవధిక షట్‌డౌన్‌కు పిలుపునిచ్చింది. సిబిఐతో పాటు ఎన్ఐఎ కూడా ఒక కుకీ వ్యక్తిని అరెస్టు చేసింది. ఈ విషయాన్ని మణిపూర్ సిఎం బీరెన్ సింగ్ కూడా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. చురాచాంద్‌పూర్ జిల్లాను షట్‌డౌన్ చేయాలని సంకల్పించినట్లు కుకీ సంస్థ ఇండిజీనియస్ ట్రైబల్ లీడర్స్ ఫోరం (ఐటిఎల్ఎఫ్) ప్రకటించింది. ఎన్ఐఎ, సిబిఐ అరెస్టు చేసిన వ్యక్తులను 48 గంటల్లో విడుదల చేయాలని ఐటిఎల్ఎఫ్ ఒక ప్రకటనలో పేర్కొన్నది.

దళితుడిపై థర్డ్ డిగ్రీ

(మొదటి పేజీ తరువాయి)

కొట్టారన్న విషయం తెలియగానే గ్రామంలోని కొంతమంది స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే కానిస్టేబుళ్లు సతీష్, శ్రీనివాస్ గోడదూకి పరారయ్యారు. ఈ విషయాన్ని క్రైమ్ ఎస్ఐ మల్లేశ్వరరావు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారు. ఆందోళనకారులతో క్రైమ్ డిసిపి నాగన్న, దిశా పోలీస్ స్టేషన్ ఎసిపి వివేకానంద మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో కానిస్టేబుళ్లు, ఎస్ఐపైనా చర్యలు తీసుకున్నారు.

అరకొరగా నియామకాలు... శాఖల తగ్గింపు

- ప్రభుత్వ బ్యాంకుల్లో పనిభారం



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పనిభారం పెరిగిపోతోంది. బ్యాంకుల్లో నియామకాలు అరకొరగా ఉంటున్నాయి. అదే సమయంలో బ్యాంక్ శాఖల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. 2017-22 మధ్యకాలంలో దేశంలోని ప్రభుత్వ బ్యాంక్ శాఖల సంఖ్య 7,189 తగ్గింది. అదే సమయంలో ప్రయివేటు బ్యాంకులు కొత్తగా 13,211 శాఖలు ప్రారంభించాయి. బ్యాంకుల్లో సిబ్బందికి పనిభారం బాగా పెరుగుతోందని, నియామకాలు సరిగా జరగడం లేదని అఖిలభారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల వినియోగదారుల సంఖ్య అనేక రెట్లు పెరిగిందని ఆయన చెప్పారు.

ఉద్యోగుల సంఖ్య తగ్గడం, ఉన్న వారిపై పనిభారం పెరగడం, శాఖల విస్తరణను తగ్గించడం వంటి పరిణామాలు బ్యాంకుల ప్రయివేటీకరణకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు సూచికలని అఖిలభారత బ్యాంక్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. నాగరాజన్ తెలిపారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వ బ్యాంకులతో పోలిస్తే ప్రయివేటు బ్యాంకులే ఎక్కువ ఉద్యోగాలు కల్పించాయి. 2022-23లో ప్రయివేటు బ్యాంకులు 98,518 మందికి ఉద్యోగాలు ఇస్తే ప్రభుత్వ బ్యాంకులలో మాత్రం ఉద్యోగుల సంఖ్య 3,385 తగ్గిందని రిజర్వ్ బ్యాంక్ సమాచారాన్ని ఉటంకిస్తూ హిందూ బిజినెస్ లైన్ పత్రిక తెలియజేసింది. ప్రభుత్వ బ్యాంకులలో ఒక్కో ఉద్యోగి నిర్వహిస్తున్న సగటు వ్యాపార కార్యకలాపాల విలువ రూ.23.80 కోట్లు ఉంటే ప్రైవేటు బ్యాంకులలో అది రూ.15.02 కోట్లుగా ఉన్నదని భారతీయ బ్యాంకుల సంఘం చెబుతోంది.

దేశవ్యాప్తంగా నేడు బ్లాక్ డే

- సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల, సమాఖ్యల సంయుక్త వేదిక పిలుపు



న్యూఢిల్లీ : 2021 అక్టోబర్ 3న లఖింపూర్ ఖేరీలో రైతుల హత్యాకాండలో ప్రధాన కుట్ర దారైన కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా తెనీని తక్షణమే పదవి నుంచి తొలగించి, ప్రాసిక్యూట్ చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా మంగళవారం బ్లాక్ డే నిర్వహించాలని సంయుక్త కిస్తాన్ మోర్చా (ఎస్‌కెఎం), కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యల సంయుక్త వేదిక పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశాయి. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా రైతులు, రైతు కూలీలు ప్రదర్శనలు నిర్వహించడం, దిష్టి బొమ్మలు తగలబెట్టడం, జిల్లా, తహసిల్ కేంద్రాల స్థాయిల్లో బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించడం చేయనున్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యల సంయుక్త వేదిక తరపున న్యూఢిల్లీలోని తల్కటొరా స్టేడియంలో ఆగస్టు 24న జరిగిన అఖిల భారత రైతులు, రైతు కూలీల సదస్సు ఈ బ్లాక్ డే కు పిలుపునిచ్చింది. లఖింపూర్ ఖెరి దాడిలో నలుగురు రైతులు చనిపోవడం వెనుక మంత్రి ఆయన కుమారుడు అశీష్ మిశ్రా పాత్ర వుందని, వ్యవసాయ చట్టాలను నిరసిస్తూ జరిగిన ఐక్య రైతు ఆందోళనను అణచివేయడానికి బిజెపి పన్నిన కుట్ర ఇదని ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. గత రెండేళ్లలో ప్రధాని మోడీ అజయ్ మిశ్రాను డిస్మిస్ చేయడం కానీ, రాజీనామా చేయాలని కోరడం గానీ జరగలేదు. ఎఫ్ఐఆర్‌లో మంత్రి పేరు వున్నప్పటికీ ప్రధాని ఆయనను రక్షిస్తున్నారని ఆయా సంఘాలు విమర్శించాయి. సుప్రీం జోక్యం తర్వాతనే యుపి ప్రభుత్వం అశీష్ మిశ్రాను, ఇతర నిందితులను అదుపులోకి తీసుకుందని, వారితో పాటూ అమాయకులైన రైతులను కూడా అరెస్టు చేశారని పేర్కొంది. ప్రజాస్వామ్య రీతిలో ఉద్యమాలు జరుపుతున్న వారిపై జరిగే అణచివేత, దాడులకు నిరసనగా బ్లాక్‌డే పాటిస్తున్నట్లు ఎస్‌కెఎం, సంయుక్త వేదిక పేర్కొన్నాయి. మోడీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను తీవ్రంగా నిరసించాయి. చారిత్రక రైతు పోరాటం సందర్భంగా రైతులపై పెట్టిన తప్పుడు కేసులను ఇప్పటికైనా ఉపసంహరించాలని డిమాండ్ చేశాయి.

రాజకీయ లబ్ధి కోసమే ప్రధాని వరుస పర్యటనలు

- సచిన్ పైలట్

జైపూర్ : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకే ప్రధాని సహా బిజెపి నేతలు రాష్ట్రంలో పర్యటిస్తున్నారని, రాజస్థాన్ అభివృద్ధికి వారు చేసిందేమీ లేదని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ అన్నారు. ప్రధాని పర్యటన రాజకీయపరమైనదేనని, పాలనాపరంగా ఎలాంటి ప్రాధాన్యత లేదని ఆయన అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరోసారి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎనిమిది కోట్ల రాజస్థాన్ ప్రజల ఆకాంక్షలు కాషాయ నేతలకు పట్టవని, వారు కేవలం ఎన్నికల ప్రచారం కోసమే రాష్ట్రానికి వస్తున్నారని చెప్పారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చిత్తోర్‌ఘఢ్‌లో మోడీ ప్రచారం

రాజస్థాన్‌లోని చిత్తోర్‌ఘఢ్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో దళితులు, మహిళలపై వేధింపులు పెరగడంతో ప్రజలు బిజెపికి పట్టం కట్టాలని భావిస్తున్నారని మోడీ అన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత ఉంటుందని ప్రజలు నమ్ముతున్నారని అన్నారు.

ఉద్యమాలు మరింత ఉధృతం

- ఎంఎ గఫూర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని, సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్ పిలుపునిచ్చారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రెండు రోజుల వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎంఎ గఫూర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉద్యోగులకు, కార్మికులకు హక్కులు లేకుండా ఏకంగా చట్టాలనే మార్చేసిందన్నారు. ఎన్నో ఏళ్లుగా వున్న కార్మికుల హక్కులను కాలరాసిందని విమర్శించారు. మహిళల కోసం మహిళా బిల్లును ప్రవేశపెట్టామని ఆర్భాటంగా చెబుతున్న ప్రభుత్వం మహిళలకు, శిశువులకు సేవలను, పౌష్టికాహారాన్ని అందించే అంగన్‌వాడీలను ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా మోడీ బాటలో అంగన్‌వాడీలను పూర్తిగా విస్మరించారని విమర్శించారు. అంగన్‌వాడీలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలుచేయాలన్నారు. అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమాలను అంచెలంచెలుగా ఉధృతం చేయాలని కోరారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్లలో ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. బాలింతలకు ఆహారాన్ని అందకుండా చేసే యాప్‌లను నిలిపేయాలన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, పిఎఫ్, గ్రాట్యూటీని అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం అన్ని రాజకీయ పార్టీలనూ, కార్మిక, ప్రజా సంఘాలనూ, లబ్ధిదారులనూ కలుపుకుని బలమైన ఉద్యమాలను నిర్మించేందుకు సన్నద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి బేబీరాణి, నాయకులు రోజా, సుప్రజ, నాగశేషు, అన్నపూర్ణ, వెంకటమ్మ, షేఖారాణి, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

యుపి పోలీసులది పక్షపాత చర్య

- కుషినగర్ మత ఘర్షణలపై స్థానిక ముస్లిముల విమర్శ

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని కుషినగర్‌లో ఇటీవల చోటు చేసుకున్న మత ఘర్షణలపై అక్కడి పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల స్థానిక ముస్లిములు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఒకవైపు మాత్రమే ఉంటున్నారని అన్నారు. మెజారిటీ వర్గం ప్రజల పట్ల పక్షపాతాన్ని చూపిస్తూ, మైనారిటీ వర్గం వారిని దురాక్రమణదారులుగా చిత్రీకరిస్తున్నారని చెప్పారు. "యూపీ పోలీసులు దర్యాప్తు పేరుతో సెలెక్టివ్‌గా ముస్లింలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. నా సోదరుడు సైఫ్ ఇంటికి వస్తున్న సమయంలో కసియా బస్టాండ్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. మిలాద్ ఊరేగింపును చూడటానికి వెళ్లి అతను ఇంటికి వస్తున్నాడు. హింసతో ఆయనకు సంబంధం లేదు. అయినప్పటికీ, పోలీసులు ఆయనను అరెస్టు చేశారు" అని సైఫ్ సోదరుడు సన్నీ ఖాన్ తెలిపాడు. గతనెల 28న ఈద్ మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు కుషినగర్‌లోని కసియాలో మెజారిటీ వర్గం ప్రజలుండే గోల బజార్ నుంచి వెళ్తున్న సందర్భంగా రెండు గ్రూపుల మధ్య మత ఘర్షణ చోటు చేసుకున్నది. హింసలో రాళ్లదాడి ఆరోపణలపై అరెస్టయిన 31 మంది ముస్లిములే కావటం గమనార్హం. వీరిలో 15 మంది మైనర్లు ఉన్నారు. వీరందరి పైనా పోలీసులు ఐపీసీలోని పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. "ఇది ఇబ్బందులకు గురి చేయటమేనని స్పష్టమవుతున్నది. మేమంతా శాంతియుతంగా, సామరస్యంగా ఉన్నాం. కానీ, ఒక గ్రూపు పైనే చర్యలు తీసుకున్నారు. ఈ అల్లర్లకు సమాన బాధ్యత వహించాల్సిన ఇతర గ్రూపు వారిని మాత్రం విడిచిపెట్టారు" అని సబీర్ అనే స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

నాందేడ్ ఆసుపత్రిలో ఘోరం

- ఒకే రోజులో 24 మంది మృతి



కఠిన చర్యలు తీసుకోండి: సుప్రియా సూలే

నాందేడ్: మహారాష్ట్రలోని ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో మరో విషాదం చోటుచేసుకుంది. నాందేడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకరోజు 24 మంది మరణించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మృతుల్లో 12మంది నవజాత శిశువులు ఉన్నారు. ఆసుపత్రిలో ఔషధాలు, సిబ్బంది కొరత వల్లే ఈ దారుణం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రిలో సోమవారం సాయంత్రానికి గత 24గంటల వ్యవధిలో 24 మంది మరణించారని, వీరిలో 12మంది నవజాతా శిశువులు ఆసుపత్రి డీన్ శంకర్‌రావు చవాన్ వెల్లడించారు. వివిధ రకాల వ్యాధులు, ముఖ్యంగా పాముకాటు కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. ఆసుపత్రిలో పలువురు సిబ్బందిని బదిలీ చేయడంతో రోగులకు సేవలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నట్లు చెప్పారు. ఈ దారుణంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. మూడు ఇంజిన్ల (బిజెపి, ఏక్‌నాథ్ షిండే- శివసేన, ఎన్‌సిపి- అజిత్ పవార్ (గ్రూపు) ప్రభుత్వమే ఈ మరణాలకు బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నాయి.

ఆసుపత్రిలో ఒకరోజు 12మంది నవజాత శిశువులతో పాటు 24మంది మరణించిన ఘటనను ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే తీవ్రంగా ఖండించారు. ఈ మరణాలు ఖచ్చితంగా యాదృచ్ఛికం కాదని, వీటిపై సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. మహారాష్ట్ర ప్రజల ప్రాణాలంటే అంత చులకనా? అని మండిపడ్డారు. ఆసుపత్రుల్లో మందుల కొరత కారణంగా సకాలంలో మందులు అందడంలేదని రోగులు వాపోతున్నారని చెప్పారు. ఈ ఘటనలో కఠిన చర్య తీసుకోవాలని సుప్రియా సూలే డిమాండ్ చేశారు. సంబంధిత మంత్రులతో రాజీనామా చేయించాలని, అలాగే, మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

జింబాబ్వేలో విమానం కూలి ఆరుగురు దుర్మరణం

- మృతుల్లో భారత వ్యాపారవేత్త

హరారే: జింబాబ్వేలో జరిగిన విమాన ప్రమాదంలో భారత మైనింగ్ వ్యాపారవేత్త, ఆయన కుమారుడితో సహా ఆరుగురు మృతి చెందారు. బంగారం, బొగ్గు, నికెల్, రాగిని శుద్ధి చేసే డైవర్సిఫైడ్ మైనింగ్ కంపెనీ రియోజిమ్ యజమాని హర్పాల్ రంధావా ప్రయాణిస్తున్న ఈ ప్రైవేట్ విమానం నైరుతి జింబాబ్వేలోని వజ్రాల గని సమీపంలో కూలిపోయినట్లు జింబాబ్వే మీడియా వెల్లడించింది. రియోజిమ్ కి చెందిన సెస్నా 206 విమానం జింబాబ్వే రాజధాని హరారే నుంచి మురోవా వజ్రాల గనులకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విమానంలోని సింగిల్ ఇంజిన్ లో సాంకేతిక లోపమే దీనికి కారణమై ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. చనిపోయిన వారిలో నలుగురు విదేశీయులు కాగా.. మిగిలిన ఇద్దరు జింబాబ్వేకు చెందిన వారని పోలీసుల నివేదికను ఉటంకిస్తూ ప్రభుత్వ యాజమాన్య పత్రిక హెరాల్డ్ పేర్కొంది.

దొంగతనం చేశాడంటూ బాలుడిపై దాష్టీకం

- యుపిలో ఘోరం

లక్నో: టీ దుకాణంలో నగదు దొంగతనం చేశాడని ఆరోపిస్తూ ఒక మైనర్ బాలుడిని నగ్నంగా స్తంభానికి కట్టేసి, తీవ్రంగా కొట్టిన సంఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. నొప్పిని భరించలేక ఆ 12 ఏళ్ల బాలుడు విలవిల్లాడుతున్నా సరే ఒక్కరు కూడా పట్టించుకోలేదు. ఈ దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధిస్తూ మౌనంగా నిలబడిపోయారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో సోమవారం ఉదయం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి బాధితుడిని రక్షించారు. వైద్య చికిత్స అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా ఎస్‌పి సర్వేశ్ కుమార్ మిశ్రా తీవ్రంగా స్పందించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈ కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

బండారు నిర్బంధంపై హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణకు హైకోర్టు నో

ప్రజాశక్తి-అమరావతి



రాష్ట్ర మాజీ మంత్రి, తెలుగుదేశం నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి అరెస్టు వ్యవహారంలో హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ చేపట్టేందుకు హైకోర్టు నిరాకరించింది. రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో పోలీసులు బండారును నిర్బంధంలోకి తీసుకున్నారు. ఈ చర్య చట్టప్రకారం లేదంటూ ఆయన సోదరుడు బండారు సింహాద్రిరావు సోమవారం హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. మంత్రి రోజాపై బండారు అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ గుంటూరు, అరండల్‌పేట, నగరపాలెం పోలీసు స్టేషన్లలో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో సిఆర్‌పిసి కింద నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేసేందుకు విశాఖపట్నం జిల్లా, వెన్నలపాళెంలోని బండారు ఇంటికి పోలీసులు వెళ్లారు. 41 ఎ నోటీసు ఇవ్వకుండా అక్రమంగా అరెస్టు చేశారని, తన సోదరుని కోర్టులో హాజరు పరిచే విధంగా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిని అత్యవసరంగా విచారణ చేపట్టేందుకు హైకోర్టు చర్యలు తీసుకునే దశలో రిజిస్ట్రీకి సమాచారం అందింది. పోలీసులు సిఆర్‌పిసి చట్ట నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేశారని తెలుసుకున్న హైకోర్టు పిటిషన్ పై విచారణ చేపట్టేందుకు నిరాకరించింది.



స్వర్ణ దేవాలయాన్ని సందర్శించిన రాహుల్

అమృత్‌సర్ : అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని రాహుల్ గాంధీ సందర్శించారు. అనంతరం ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. రాహుల్ ఒక సాధారణ భక్తుడిలా ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం స్వచ్ఛంద సేవల్లోనూ పాల్గొన్నారు. ఇతర భక్తులతో కలిసి ఆలయ ప్రాంగణంలో భక్తులు ఉపయోగించిన గిన్నెలను రాహుల్ శుభ్రపరిచారు.

ఉడాయ్ సిఇఒ అమిత్ అగర్వాల్ పదవీకాలం పొడిగింపు..

న్యూఢిల్లీ: యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా సిఇఒ అమిత్ అగర్వాల్ పదవీకాలాన్ని కేంద్రం పొడిగించింది. కేబినెట్ నియామకాల కమిటీ అమిత్ అగర్వాల్ పదవీకాలం పెంపునకు ఆమోదముద్ర వేసింది. ఆయన పదవీకాలం ఈ ఏడాది నవంబర్ 2తో ముగియనుండగా.. వచ్చే ఏడాది నవంబర్ 2 వరకు లేదంటే తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సిఇఒగా కొనసాగుతారని పేర్కొంది. అమిత్ అగర్వాల్ 1993 బ్యాచ్‌కు చెందిన అధికారి. కేంద్ర సర్వీసులతో పాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ కీలకశాఖల్లో సేవలందించారు. టెక్నాలజీ, ఫైనాన్స్, ఇన్నోవేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్ రంగాల్లోనూ పని చేశారు.

రీటా వశిష్ఠకు పదోన్నతి

కేబినెట్ నియామకాల కమిటీ డాక్టర్ రీటా వశిష్ఠను కేంద్ర చట్టం, న్యాయ శాఖలోని సెంట్రల్ ఏజెన్సీ విభాగానికి ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. తాత్కాలికంగా అప్‌గ్రేడ్ చేసిన ఈ పోస్టుకు సంబంధించిన ర్యాంక్, వేతనం కేంద్ర ప్రభుత్వ కార్యదర్శికి సమానమని, ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని పేర్కొంది. జులై 21, 2025, లేదంటే తదుపరి ఉత్తర్వుల వరకు ఉత్తర్వులు అమలులో ఉంటాయని తెలిపింది.

పబ్లిక్ సర్వీసుపై కాపీరైట్ వాదనలు చేయం

న్యూఢిల్లీ : పార్లమెంటరీ ప్రసారాలతో పాటు పబ్లిక్ సర్వీస్ కంటెంట్‌పై కాపీరైట్ వాదనలు చేయబోమని ప్రసార భారతి స్పష్టం చేసింది. పార్లమెంటరీ ప్రొసీడింగ్స్ విషయంలో యూట్యూబర్లకు కాపీరైట్ ఉల్లంఘన నోటీసులు పంపిందన్న ఆరోపణలపై ప్రసార భారతి ఈ మేరకు స్పందించి ప్రకటనను విడుదల చేసింది. పార్లమెంటరీ ప్రసారాలు కాపీరైట్‌కు సంబంధించినవి కావనీ, ఇవి సులభంగా పొందగలిగేలా ఉండాలని రాజ్యసభ టివి ఎడిటర్, మాజీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుర్‌దీప్ సింగ్ సప్పల్ వాదించారు. యూట్యూబర్లకు ప్రసార భారతి నోటీసులు పంపటం సరికాదని అన్నారు. తామెప్పుడూ కాపీరైట్ నోటీసులు జారీ చేయలేదని ప్రసార భారతి అధికారులు నొక్కి చెప్పారు. ప్రజా సేవ సంబంధిత కంటెంట్‌కు కాపీరైట్‌తో సంబంధం ఉండదని వివరించారు.

వైద్య రంగంలో ఇద్దరికి నోబెల్

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ ఉపాధ్యక్షురాలిగా కూడా పనిచేశారు. ఇక అమెరికాకు చెందిన వెయిస్‌మన్ పెన్సిల్వేనియా యూనివర్సిటీకి చెందిన పెరల్‌మాన్ వైద్య పాఠశాలలో టీకాల పరిశోధనా విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. నోబెల్ బహుమతి కింద రూ.8.3 కోట్ల నగదు, జ్ఞాపికను ఈ నెల 10న వీరికి అందజేస్తారు. అందజేస్తారు. స్వీడన్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరిట వైద్యం, సాహిత్యం, ఆర్థికశాస్త్రం, భౌతిక, రసాయన శాస్త్రాలతో బాటు ప్రపంచ శాంతికి కృషి చేసినవారికి కూడా ఈ పురస్కారాలను నోబెల్ అకాడెమీ అందజేస్తుంది. నోబెల్ బహుమతుల పరంపరలో భాగంగా మంగళవారం ఫిజిక్స్, బుధవారం రసాయన శాస్త్రం, గురువారం సాహిత్యం, శుక్రవారం శాంతి బహుమతులను ప్రకటిస్తారు. చివరిగా ఈ నెల9న ఆర్థిక శాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని ప్రకటించనున్నట్లు నోబెల్ అసెంబ్లీ సెక్రటరీ థామస్ పెర్లమన్ వెల్లడించారు.

బీహార్‌లో 63% పైగా వెనుకబడిన తరగతులవారే

(మొదటి పేజీ తరువాయి)

సంకలనం చేసి అతి తక్కువ వ్యవధిలోనే విడుదల చేయడం గొప్ప విషయమన్నారు. బీహార్ ఇప్పుడు ఒక గీతను గీసి దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన చెప్పారు.

కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ఈ కుల గణన నివేదికను స్వాగతించారు. బిసి, ఎస్సీ, ఎస్టీలు మొత్తంగా కలిపి 88 శాతం అంటే మూడింట రెండొంతులకు పైగా ఉన్నారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 90 మంది సెక్రటరీలు ఉంటే వారిలో బిసిలు కేవలం ముగ్గురే ఉన్నారని కేంద్ర బడ్జెట్‌లో వీరికి 5 శాతం నిధులు మాత్రమే కేటాయించారని రాహుల్ అన్నారు. ఈ రీత్యా కులగణన ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని ఆయన చెప్పారు.

ఈ సర్వేలో కేవలం కులం గురించి మాత్రమే కాకుండా సామాజిక- ఆర్థిక సూచికలకు చెందిన 17 ప్రశ్నలు కూడా ఉన్నాయి. సర్వేలో పేర్కొన్న 214 కులాలకు వేర్వేరుగా ప్రత్యేక కోడ్‌లను కేటాయించారు. ఈ ఏడాది జనవరి 7న బీహార్ ప్రభుత్వం ఈ సర్వేను ప్రారంభించింది. ఈ ఆగస్టుతో పూర్తయింది. ఈ సర్వేకు వ్యతిరేకంగా బీహార్ హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలయింది. అయితే, ఆ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. రాష్ట్రంలోని 38 జిల్లాలోనూ ఈ సర్వేను నిర్వహించారు. ఈ ప్రక్రియలో సుమారు 2.64 లక్షల మంది ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు. 2.90 కోట్ల నమోదిత కుటుంబాల వివరాలను సేకరించారు.

కేంద్ర ప్రభుత్వం 2011లో సామాజిక- ఆర్థిక- కుల గణన (ఎస్ఇసిసి 2011) పేరుతో కులాల వివరాలను సేకరించింది. అయితే ఈ సమాచారాన్ని బయటకు వెల్లడించకుండా తొక్కిపట్టింది. కోవిడ్ వల్ల ఆలస్యమైన 2021 జనాభా లెక్కల సేకరణలో కుల గణన చేపట్టాలని అన్ని ప్రతిపక్ష పార్టీలు చేసిన డిమాండ్‌ను మోడీ ప్రభుత్వం మొండిగా తిరస్కరిస్తున్నది.

సంక్షిప్తంగా...

నైజీరియా: నైజీరియాలో సమ్మెకు కార్మిక సంఘాలు సిద్ధమవుతుండడంతో యూనియన్ల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు అధ్యక్షుడు బోలలా తినుబు చివరి నమిషంలో కొన్ని చర్యలు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలను పెంచుతున్నామని చెప్పారు. కింది కేడర్ సిబ్బందికి వచ్చే ఆరు మాసాల్లో 25వేల నైరాలు అదనంగా చెల్లించనున్నట్లు తెలిపారు. నైజీరియా 63వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జాతి నుద్దేశించి చేసిన టివి ప్రసంగంలో ఈ విషయం వెల్లడించారు.


అమెరికా: షట్‌డౌన్ ముప్పు ప్రస్తుతానికి తొలగిపోయినట్టేనని శనివారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత ఫెడరల్ ప్రభుత్వం ప్రకటించింది. ఉభయపక్షాల మధ్య కుదిరిన డీల్‌ను అమెరికన్ కాంగ్రెస్ ఆమోదించడానికి సమయం చాలా తక్కువగా ఉండడంతో కొద్ది సేపు ప్రభుత్వ సంస్థలను తెరచి ఉంచే తాత్కాలిక నిధుల చెల్లింపు బిల్లులపై అధ్యక్షుడు జో బైడెన్ సంతకం చేశారు. దీంతో ఫెడరల్ ప్రభుత్వషట్‌డౌన్ ముప్పు తొలగిపోయింది. నవంబరు17 వరకు ప్రభుత్వానికి నిధులు అందించే ప్యాకేజీకి కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. అయితే రిపబ్లికన్ ఎంపీల నుంచి వ్యతిరేకత పెరుగుతుండడంతో ఉక్రెయిన్‌కు సాయం తగ్గించబడింది. విపత్తు ఫెడరల్ సహాయాన్ని 1600 కోట్ల డాలర్లకు పెంచింది.

పోలండ్ ప్రతిపక్ష నాయకుడు డొనాల్డ్ టస్క్ పోలిష్ రాజధాని వార్సాలో ఆదివారం జరిగిన ర్యాలీలో తన మద్దతుదారులనుద్దేశించి మాట్లాడుతూ,'మెరుగైన జీవనం కోసం మార్పు అనివార్యం' అని అన్నారు. ఈ నెల 15న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ప్రస్తుత కన్సర్వేటివ్ మితవాద ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడం ఖాయమన్నారు. ఈ సారి తన పార్టీ నేతృత్వంలోని సంకీర్ణ కూటమి విజయావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

సెర్బియా: సెర్బియా అధ్యక్షుడు ఉసిస్ తన దేశానికి వ్యతిరేకంగా అబద్ధాలను ప్రచారం చేయడాన్ని ఖండించారు. హంగేరి ప్రధాని విక్టర్ ఒబ్రాన్‌తో బెల్గ్రేడ్‌లోని సెర్బియాలో చర్చల అనంతరం పత్రికా గోష్టిలో మాట్లాడుతూ, కొసావో సరిహద్దు పొడవునా తమ సైన్యాన్ని మోహరించినట్లు వచ్చిన వార్తలను ఖండిస్తున్నామని చెప్పారు. అంతకుముందు కొసావో ప్రభుత్వం ఒక ప్రకటన చేస్తూ, సెర్బియన్ మిలిటరీ మూడు విభిన్న మార్గాల నుంచి సరిహద్దువైపు వస్తున్న దృష్ట్యా పరిస్థితిని క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పింది. తన మిలిటరీ బలగాలను వెంటనే వెనక్కి తీసుకుని, సరిహద్దును సైనిక రహితంగా ఉంచాలని సెర్బియాను కోరింది. మా దళాలను పెద్దయెత్తున మోహరించామని వారు అబద్ధాలు చెబుతున్నారని సెర్బియా అధ్యక్షుడు ఉసిస్ చెప్పారు.



ఎప్పడూ నిజమే చెప్పాలి



రవి ఏడవ తరగతి చదువుతున్నాడు. చదువులో ఎప్పుడూ ముందుంటాడు. ఒక రోజు తెలుగు ఉపాధ్యాయుడు శేఖరం మాస్టారు పాఠం మొదలు పెడుతూ 'పిల్లలూ నిన్నటి పాఠం గురంచి నేను ఇచ్చిన హోం వర్క్ తీసుకురం'డి అన్నారు. రవి తప్ప అందరూ హోంవర్క్ నోట్ బుక్స్ టేబుల్ పైన పెట్టారు.

రవి హోం వర్కు చేయలేదన్న సంగతి గుర్తించిన మాస్టారు 'ఏం రవి.. నువ్వు హోం వర్కు చేయలేదా?' అని ప్రశ్నించారు. 'సార్, నేను హమ్ వర్క్ చేయలేదు' అన్నాడు రవి. 'కారణం చెప్పకుండా 'చేయలేదు' అని నిర్లక్ష్యంగా చెబుతావా, ఇటురా' అంటూ బెత్తం తీసుకున్నారు మాస్టారు. అప్పుడు రవి, 'సార్ మా అమ్మ ఇళ్లల్లో బట్టలుతికే పని చేస్తుంది. నిన్న సాయంత్రం మా అమ్మకు ఆరోగ్యం బాగోలేక పనికి వెళ్లలేదు. అయితే ఒక ఇంట్లో తప్పనిసరిగా పని చేయాల్సి వచ్చింది. దీంతో నేను వెళ్లి, వాళ్ల బట్టలు ఉతికి వచ్చాను. ఇంటికి వచ్చేసరికి బాగా ఆలస్యమవ్వడంతో హోం వర్కు చేయలేకపోయాను' అంటూ జరిగిన సంగతి చెప్పాడు. మాస్టారు బెత్తం పక్కన పెట్టి రవిని దగ్గరకు పిలిచారు. 'పిల్లలూ హోమ్ వర్క్ చేయలేదు అనడానికి ఏ కాలు నొప్పో, కడుపు నొప్పో, జ్వరమో ఇలా ఏదో ఒక వంకతో అబద్ధం చెప్పవచ్చు. కానీ రవి ఏమాత్రం సిగ్గుపడకుండా వాళ్ల అమ్మ చేసే పని చేశానని చెప్పాడు. అబద్ధం ఆడకుండా నిజం చెప్పాడు. ఎప్పుడూ అబద్ధం ఆడకూడదు. నిజమే చెప్పాలి. అదే మీకు గౌరవం తెచ్చిపెడుతుంది. ఈ సందర్భంగా మీకు మన జాతిపిత గాంధీ జీవితంలో జరిగిన ఒక సంగతి చెబుతాను వినండి.ఒకసారి గాంధీజీ ఇంట్లో వాళ్లు కోప్పడతారని ఒక సందర్భంలో అబద్ధం చెప్పాడు. కొన్ని రోజుల తరువాత ఆయన 'సత్య హరిశ్చంద్ర' అనే నాటకం చూశాడు. అది ఆయన్ను ఎంతో ప్రభావితం చేసింది. వెంటనే ఇంటికి పరుగెత్తికెళ్లి తను అబద్ధం చెప్పిన విషయాన్ని చెప్పి క్షమించమని అడిగాడు. అది మొదలు ఎప్పుడూ ఆయన అబద్ధం ఆడలేదు' అని చెప్పారు. మాస్టారు మాటలు విన్న పిల్లలు 'ఇక మీదట మేము కూడా అబద్ధాలు చెప్పం సార్' అని ముక్తకంఠంతో అరిచారు.

– యు.విజయశేఖర రెడ్డి,
99597 36475.

నేను గీసిన బొమ్మ



ఇత్తడి సారిక,
4వ తరగతి,
ఎంపిపి స్కూల్,
దర్శి, ప్రకాశం జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



కరోనా రక్కసి సృష్టించిన బీభత్సం ఇప్పుడప్పుడే మరిచిపోలేం. భారీ సంఖ్యలో చోటుచేసుకుంటున్న మరణాలతో ప్రపంచం వణికిపోతున్న రోజులవి! ఆ భయానక రోజుల్లోనే కరోనాకు వ్యాక్సిన్ సిద్ధమౌతోందంటూ వచ్చిన వార్తలు కూడా అంతే కలకలం రేపాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజానీకంలో ఎన్నో అనుమానాలు! అందరిలోనూ 'ఇంత త్వరగా వ్యాక్సినా... ఎలా తయారైంది?' అన్న ప్రశ్నే! దానికి సమాధానమే తాజా నోబెల్ బహుమానం అందుకుంటున్న కాటలిన్ కరికో! మరోశాస్త్రవేత్త డ్రూ వెయిస్‌మన్‌తో కలిసి ఎంఆర్ఎన్ఎ వ్యాక్సిన్ల అభివృద్ధికి, వైద్య శాస్త్రంలో విశేష కృషి చేసినందుకు ఆమె 2023వ సంవత్సరపు నోబెల్ బహుమతిని అందుకుంటున్నారు. 68 సంవత్సరాల కాటలిన్ కరికో వైద్య రంగంలో నోబెల్ బహుమతిని అందుకుంటున్న 13వ మహిళ! 2020 సంవత్సరం చివర్లోనే అందుబాటులోకి వచ్చిన ఫైజర్-మోడెర్నా వ్యాక్సిన్ కరోనా పై మానవాళి చేసిన పోరాటంలో గేమ్ ఛేంజర్‌గా ఖ్యాతి పొందడం వెనుక కాటలిన్ కరికో ఏళ్ల తరబడి సాగించిన కృషి ఉంది.

నిరంతర కృషికి నోబెల్

వైద్య శాస్త్రంలో కాటలిన్ చేసింది మాములు కృషి కాదు. ప్రపంచమంతా ఒకవైపు నడుస్తుంటే , దానికి భిన్నమైన మరో దారిని ఎంచుకోవాలంటే ఎంత ధైర్యం కావాలి! ఆ పనే ఆమె చేసింది. 1980వ దశకం ఆరంభంలో ప్రపంచ వ్యాప్తంగా వైద్యరంగ నిపుణులు డిఎన్ఎల వైపు దృష్టి సారించారు. డిఎన్ఏల పై పరిశోధన ద్వారా అద్భుతాలను సాధించవచ్చని వైద్యశాస్త్రం నమ్ముత్ను రోజులవి! ఆ సమయంలో కాటలిన్ ఆర్ఎన్ఎల వైపే అడుగులు వేశారు. సహోద్యోగులు, మిత్రులు అందరూ ఆ పరిశోధనలను వదిలి డిఎన్ఎలవైపు వచ్చేయాలని ఎంతగానో ఒత్తిడి చేశారు. 'ప్రపంచమంతా డిఎన్ఎ వైపు వెడుతుంటే ఆర్ఎన్ఎలో ఏం సాధిస్తావు?' అంటూ ప్రశ్నించిన వాళ్లు ఉన్నారు. ఈ ఒత్తిడి తట్టుకుంటూ ఏళ్ల తరబడి నిరంతరాయంగా పరిశోధనలు సాగించడమంటే మాటలా? అయినా ఆమె అనుకున్నది సాధించారు. హంగేరిలోని అత్యంత నిరుపేద కుటంబంలో కాటలిన్ జన్మించింది. ఆమె తండ్రి మాంసం విక్రేత. ఆమె తల్లి కూడా పుస్తకాల షాపులో పనిచేస్తేనే జీవనం సాగేది. రేడియో, టివిల వంటివి కాదుగదా, కడుపునిండా తనడానికి కూడా లేని దుర్భర పరిస్థితుల్లో తన బాల్యం సాగినట్లు కాటలిన్ చెప్పారు. అయినా, ప్రాథమిక విద్యలో సైన్స్‌లో ముఖ్యంగా జీవశాస్త్రంలో ఆమె చిన్నప్పటి నుండి రాణించారు. పిహెచ్‌డి చేసిన తరువాత 1985లో ఆమె హంగేరిని వీడి అమెరికాకు చేరుకున్నారు.

ఆర్ఎన్ఏలపై దృష్టి ఇలా...

1988–89 మధ్య కాలంలో ఆమె ఎయిడ్స్ రోగులకు నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో పాల్గొన్నారు. తీవ్ర స్థాయిలో బాధ పడుతున్న వారికి కూడా డబుల్ స్టాండర్డ్ ఆర్ఎన్ఎ (డిఎస్ ఆర్ఎన్ఎ)తో చేసిన చికిత్స ఉపశమనం కలిగించడం ఆమె గమనించారు. ఈ విధానం గురించి అప్పట్లో పూర్తిస్థాయి అవగాహన లేకపోయినప్పటికీ ఎయిడ్స్ చికిత్సలో కీలక అడుగుగా శాస్త్ర సమాజం భావించింది. అప్పటినుండి ఆర్ఎన్ఏలపై ఆమె పూర్తిస్థాయి దృష్టి సారించింది. ఎయిడ్స్‌పై జరిగిన పరిశోధనలకు భిన్నంగా స్వతసిద్ధంగా ఆర్ఎన్ఏనే రోగ నిరోధక శక్తి పెంచుకునేలా ఎందుకు చేయకూడదు? అని ఆమె ప్రశ్నించుకున్నారు. ఎయిడ్స్ చికిత్సలో ఆర్ఎన్ఎకు బయటనుండి ఆ శక్తిని అందించేవారు. దానికి భిన్నంగా రోగి శరీరంలోని ఆర్ఎన్ఏనే ఆ శక్తిని తయారుచేసుకునేలా (ఎంఆర్ఎన్ఎ)లా మార్చడమే ఈ పరిశోధనల సారాంశం, ఈ దిశలో రూపొందించిన పరిశోధన పత్రాలను ప్రచురించడానికి నేచర్, సైన్స్ వంటి ప్రఖ్యాత సైన్స్ జర్నల్స్ తిరస్క రించాయి. అయితే, 2005లో ఇమ్యూనిటి అనే సైన్స్ జర్నల్ ఈ పరిశోధనను ప్రచురించింది గానీ, శాస్త్ర సమాజంలో పెద్దగా గుర్తింపు రాలేదు. అయితే, కరోనా విజృంభణ తరువాత ఈ పరిస్థితి మారింది. 2020 చివరల్లో ఎంఆరఎన్ఎ సాంకేతికతతో అభివృద్ధి చేసిన వ్యాక్సిన్లకు ప్రభుత్వాల నుండి ఆమోదం లభించింది.

కమ్యూనిస్టు వ్యతిరేకి...?

కమ్యూనిస్టుల వ్యతిరేకులకి నోబెల్ కమిటీ పెద్ద పీట వేస్తుందన్న విమర్శ ఉన్న సంగతి తెలిసిందే. కాటలిన్ కూడా ఆ కోవకు చెందిన వ్యక్తే! 1980వ దశకంలో హంగేరిలో ఉన్న కమ్యూనిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆమె పనిచేశారు. హంగేరియన్ పోలీసులు ఈ విషయాన్ని గుర్తించారు. పోలీసులు చర్యలు తీసుకుంటారన్న భయంతో ఆమె తన రెండు సంవత్సరాల కూతురు, భర్తతో కలిసి హంగేరిని వదిలి అమెరికాకు చేరుకున్నారు. 'మాకున్న ఒక కారును అమ్మి, వచ్చిన 900 డాలర్లను టెడ్డిబేర్‌లో దాచి అమెరికాకు చేరుకున్నాం' అని ఆమె ఓ సందర్భంలో చెప్పారు.

డిఎన్ఎ అంటే...

డిఎన్ఎ అంటే డీ ఆక్సీరైడో న్యూక్లిక్ ఆసిడ్ . ఇది శరీరంలోని ఒక అణువు వంటిది. ఒక జీవి అభివృద్ధి చెందడానికి, జీవించడానికి, పునరుత్పత్తి చేయడానికి అవసరమైన సంకేతాలను కలిగిఉంటుంది.

ఆర్ఎన్ఎ అంటే...

రిబో న్యూక్లియిక్ యాసిడ్ (ఆర్ఎన్ఎ) జీవులతో పాటు అత్యధిక వైరస్‌లలో ఉండే అణువు. డిఎన్ఏ వంటి ప్రాథమిక నిర్మాణ యూనిట్లను ఏర్పాటుచేసే న్యూక్లియోటైడ్‌లను ఇవికలిగిఉండి, నత్రజని.ఫాస్ఫేట్ సమూహాలతో జత చేయబడి ఉంటాయి.

ఎంఆర్ఎన్ఎ అంటే...

మెసెంజర్ రిబో న్యూక్లియిక్ యాసిడ్ (ఎంఆర్ఎన్ఎ) జన్యువు యొక్క జన్యు శ్రేణికి అనుగుణంగా ఉండే ఆర్ ఆర్ఎన్ఎ యొక్క సింగిల్ స్ట్రాండ్ అణువు.

అవార్డును ప్రకటిస్తున్న నోబెల్ కమిటీ



కృషి కొనసాగుతుంది....

పరిశోధన రంగంలో తన కృషి భవిష్యత్తులోనూ కొనసాగుతుందని కాటలిన్ కరికో చెప్పారు. నోబెల్ ప్రైజ్‌కు ఆమె పేరును ప్రతిపాదించిన సమయంలో ప్రముఖ పరిశోధనా జర్నల్ 'సైన్స్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె అనేక అంశాలను ప్రస్తావించారు. క్లుప్తంగా వాటి వివరాలు

ప్ర: చాలా సంవత్సరాలు గుర్తింపు లేకుండా పరిశోధనలు చేశారు. ఇప్పుడు ఎక్కడ చూసినా మీ పేరు వినిపిస్తోంది. దీనిని ఎలా భావిస్తున్నారు?

జ: ఇది పనిలో భాగం. సంక్లిష్టమైన విషయాలను కనుగొని కొత్త తరానికి స్ఫూర్తినివ్వాలి. ప్రజలను చైతన్య పరచాలి. ఇదే మా లక్ష్యం. గుర్తింపు గురించి, బహుమతుల గురించి నేను ఆలోచించను. అయితే, నేను వాటిని గౌరవిస్తాను. సైన్స్‌ను అభివృద్ధి చేయడం, ఆ దిశలో ప్రజలను చైతన్యం చేయడమే నాకు ముఖ్యం.

ప్ర: కొవిడ్ వ్యాక్సిన్లు విజయవంతమైనాయి. తరువాత ఏమి జరగబోతోంది?

జ: కోవిడ్‌కు ముందు నుండే మోడెర్నా, బయోఎన్‌టిక్‌లు మెసెంజర్ ఆర్ఎన్ఎ ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌పై పనిచేస్తున్నాయి. నిపాను నివారించే టీకా మీద కూడా కృషి చేస్తున్నాం. ఆసియాలో ఇది కీలక పాత్ర పోషించనుంది. ఇంకొన్ని వ్యాధులపై కూడా వ్యాక్సిన్‌లు రానున్నాయి. చౌకగా ఉండటం వ్యాక్సిన్‌ల ద్వారా లభించే ప్రయోజనం.

ప్ర: ఆర్ఎన్ఎ వ్యాక్సిన్‌లు వైరస్‌లమీదనే పనిచేస్తాయా?

జ : బాక్టీరియా ద్వారా వచ్చే ఇన్‌ఫెక్షన్లమీద కూడా ఇవి సమర్ధవంతంగా పనిచేసే అవకాశం ఉంది. ఈ దిశలో పరిశోధనలు సాగుతున్నాయి. ప్రస్తుతం జంతువుల మీద ప్రయోగాలు జరుగుతున్నాయి. త్వరలోనే సానుకూల ఫలితాలు వస్తాయని భావిస్తున్నాం. మలేరియాను నియంత్రించడానికి ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ ఉంది.

ప్ర: క్యాన్సర్‌పై పోరాటంలో ఆర్ఎన్ఎ వ్యాక్సిన్‌ల ప్రభావం ఎలా ఉంటుంది?


జ: పరిశోధనలు జరుగుతున్నాయి. బయోఎన్‌టెక్ చేసిన పరిశోధన ప్రకారం ట్యూమర్ ఆపరేషన్ చేసి తొలగించడానికి వీలుగా ఉన్న సందర్భంలో వ్యాక్సిన్ ప్రభావం చూపుతున్నట్లు తేలింది. ట్యూమర్ సైజు ఎక్కువ ఉన్న వారిలో పెద్దగా ప్రభావం చూపించలేదు. మరింతగా పరిశోధనలు జరగాల్సిఉంది. ఒక్కో ట్యూమర్ ఒకో రకమైన స్వభావాన్ని కలిగిఉంటుంది. రోగనిరోధక శక్తిపై ఇవి రకరకాల స్థాయిల్లో ప్రభావాన్ని చూపుతాయి. పరిశోధనల పూర్తి ఫలితం వస్తేకాని కచ్చితంగా చెప్పలేం. అయితే, ఇప్పుడు ఎంఆర్ఎన్ఎ పరిశోధనలకు పెద్ద ఎత్తున నిధులు అందుతున్నాయి. సానుకూల ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాను.

'దేవర' కీలక సన్నివేశాల చిత్రీకరణ



ఎన్టీఆర్ కథనాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'దేవర'. జాన్వీకపూర్ కథానాయిక. శంషాబాద్‌లో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. తాజాగా అండర్‌వాటర్ సీక్వెన్స్ చిత్రీకరించారు. 'దీని కోసం రాత్రిం బవళ్లు టీమ్ కష్టపడుతోంది' అంటూ కెమెరామెన్ రత్నవేలు ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. సముద్రం మధ్యలో యాక్షన్ సన్నివేశాలను నైట్ మోడ్‌లో చిత్రీకరించాం. 'ఎన్టీఆర్‌పై సముద్ర గర్భం, ఉపరితలం స్థాయిలో కీలక సన్నివేశాలను పూర్తి చేశాం. అత్యంత కష్టమైన యాక్షన్ సన్నివేశమిది' అని తెలిపారు. టైటానిక్ షిప్‌ను తలపించేలా భారీ ఓడను, అండర్ వాటర్ సీన్స్ చిత్రీకరణ కోసం వంద అడుగులకు పైగా లోతైన సముద్రం లాంటి సెట్‌ను క్రియేట్ చేశారు. ఈ సన్నివేశాల కోసం ఎన్టీఆర్ ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నారు. యువసుధా ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయనున్నారు.

సంతృప్తిని మాటల్లో చెప్పలేం : చిరంజీవి




'దేశ ప్రజలకు ఈరోజు ఎంతో ముఖ్యమైనది. నేను చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించిన నాటి క్షణాలను గుర్తు చేసుకుంటున్నా. పాతిక వసంతాల అద్భుతమైన ప్రయాణం ఇది. ఇప్పటివరకూ 10 లక్షల బ్లడ్ యూనిట్లను సేకరించి అవసరమైన వారికి అందజేశాం. 10 వేల మందికి కంటి చూపునిచ్చాం. కరోనా సమయంలో వేల మందికి సాయం అందించాం. తోటి మానవాళికి సాయం చేయడం వల్ల వచ్చే సంతృప్తిని మాటల్లో చెప్పలేం. చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ వేదికగా ఎన్నో సేవ కార్యక్రమాల్లో తమ వంతు సాయం అందిస్తున్న అక్కా చెల్లెళ్లు, సోదరులు, అభిమానులకు సెల్యూట్ చేస్తున్నా. మన దేశానికి మనం చేస్తున్న చిరు సాయమిది' అంటూ చిరంజీవి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. సాధారణ నటుడిగా కెరీర్‌ను ప్రారంభించిన చిరంజీవి తను ఎదిగిన క్రమంలో తోటివారికి తన వంతు సాయం చేయాలనే గొప్ప సంకల్పంతో 1998 అక్టోబర్ 2 'చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్'ను ప్రారంభించిన విషయం తెలిసిందే. 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా 'సాయం చేస్తే వచ్చే సంతృప్తిని మాటల్లో చెప్పలేం' అంటూ పోస్ట్‌చేశారు.



రవితేజ కెరియర్‌లో మైలురాయి

'టైగర్ నాగేశ్వరరావు' చిత్రం రవితేజ కెరియర్‌లో ఒక మైలు రాయిగా నిలుస్తుంది. మేము కూడా స్టువర్ట్‌పురం ప్రాంతంలోనే పుట్టి పెరిగాం. 'టైగర్ నాగేశ్వరరావు' గురించి చిన్నప్పుడు కథలు కథలుగా విన్నాం. ఆ రకంగా ఈ కథ మాకు కొంచెం దగ్గరగా కనెక్ట్ అయింది. రవితేజ ఈ క్యారెక్టర్‌కి బాగా యాప్ట్ అయ్యారు. ఇందులో యాక్షన్‌ని రియలిస్టిక్‌గా కంపోజ్ చేశాం. చీరాల ప్రాంతంలో జీడి తోటల్లో కొన్ని యాక్షన్ సీన్స్ కంపోజ్ చేశాం. రవితేజ గారితో ఎన్నో చిత్రాలు చేశాం. ఈ సినిమా మాత్రం మాకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఇందులో ప్రతి యాక్షన్ ఎపిసోడ్‌ని ప్రేక్షకులు రియల్‌గా ఫీలౌతారు. ఈ చిత్రం అందరినీ అలరిస్తుంది. డైరెక్టర్ వంశీ మాకు చిన్నప్పటినుండీ తెలుసు. ఈ సినిమా కోసం మూడేళ్ళ పాటు లోతుగా పరిశోధన చేశాడు. స్థానిక ప్రాంతాల్లో తిరిగి ఎన్నో విషయాలు సంగ్రహించాడు. అద్భుతమైన కథని తయారు చేసి చాలా గొప్పగా ప్రజెంట్ చేశారు. ఈ సినిమాతో వంశీకి చాలా మంచి 'పేరువస్తుంది' అంటూ టైగర్ నాగేశ్వరరావు' చిత్ర విశేషాలు ముచ్చటించారు ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్. అక్టోబర్ 20న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది.

13న 'యూనివర్సిటీ'



స్నేహ చిత్ర పిక్చర్స్ బ్యానర్‌లో ఆర్ నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'యూనివర్సిటీ'. ఈ చిత్రం అక్టోబర్ 13న ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా ప్రసాద్ ల్యాబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ నారాయణ మూర్తి, కెమెరా మెన్ బాబూరావు దాస్, ఎడిటర్ మాలిక్, సింగర్, లిరిసిస్ట్ విజయ్ పాల్గొన్నారు. 'ఈ సినిమాలో 6 పాటలు ఉన్నాయి. గద్దర్, జలదంకి సుధాకర్, వేల్పుల నారాయణ, మోటపలుకుల రమేష్, ములుగు విజయ్ ఈ పాటలను గొప్పగా రాశారు. యూనివర్సిటీ లలో పేపరు లీకేజీలు – గ్రూపు 1–2 లాంటి ఉద్యోగ ప్రశ్న పత్రాల్లోనూ పేపరు లీకేజీలు ఇలా అయితే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి? లంబకోణాలు నేర్పిన వాళ్ళే కుంభకోణాలు జేస్తూ ఉంటుంటే రెక్కలు తెగిన జ్ఞాన పావురాలు విలవిల కొట్టుకుంటూ ఊపిరాడక నేల రాలుతుంటే కన్న తల్లితండ్రులు ఏమై పోవాలి. వాళ్లకు పాఠాలు బోధించిన గురువులు ఏమి కావాలి? విద్యార్థులు జాతి సంపద. వాళ్ళను రక్షించుకోవాల్సిన బాధ్యత సమాజం మీద ఉంది. ప్రభుత్వాల మీద ఉంది. మన అందరి మీద ఉంది అని చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ' అని ఈ సందర్భంగా ఆర్ నారాయణమూర్తి మాట్లాడారు.



1100 థియేటర్లలో '800'

ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా తెరకెక్కించిన బయోపిక్ '800' చిత్రం అక్టోబరు 6న విడుదలకు సిద్ధంగా ఉంది. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ముత్తయ్య పాత్రలో మధుర్ మిట్టల్, ఆయన భార్య మదిమలర్ పాత్రలో హీరోయిన్ మహిమా నంబియార్ నటించారు. ప్రముఖ నిర్మాత, శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణ ప్రసాద్ సమర్పణలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తెలుగు తమిళ హిందీ భాషల్లో విడుదలవుతోన్న ఈ సినిమాని మొత్తం 1100 థియేటర్లలో విడుదలచేస్తున్నట్లు నిర్మాత శివలెంక ప్రసాద్ తెలిపారు. 'ఇండియాలో సుమారు 1100 థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ముందుగా మల్టీప్లెక్స్ స్క్రీన్‌ల్లో ఆ తర్వాత థియేటర్లు పెంచుతూ వెళ్తాం. లైకా ప్రొడక్షన్స్ సంస్థ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూషన్ చేస్తోంది' అని ఈ సందర్భంగా శివలెంక ప్రసాద్ పేర్కొన్నారు.

సత్తా చాటుతున్న అథ్లెట్లు

- స్టీపుల్‌ఛేజ్, లాంగ్ జంప్‌లో రజతాలు
- భారత్ ఖాతాలో మరో ఏడు..
- 19వ ఆసియా క్రీడలు





ఆసియా క్రీడల్లో పతకాలు సాధించి భారత్‌కు విచ్చేసిన 2వ బ్యాచ్ అథ్లెట్లతో క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్; వీరిలో ఎక్కువభాగం షూటర్లు ఉండగా.. 59పతకాలకు పోటీపడి 22 పతకాలను సాధించడం విశేషం.

హాంగ్జౌ: 19వ ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు పతకాల పంట పండిస్తున్నారు. సోమవారం భారత్‌కు 3వేల మీటర్ల స్టీపుల్ ఛేస్, లాంగ్ జంప్‌లో రజత పతకాలతో సహా మొత్తం ఏడు పతకాలు దక్కాయి. ఇందులో మూడు రజత పతకాలతోపాటు మరో నాలుగు కాంస్య పతకాలున్నాయి. ఇక మహిళల 3వేల మీటర్ల స్టీపుల్ ఛేస్‌లో పారుల్ చౌదరి రజతం, ప్రీతి కాంస్య పతకాలను సాధించారు. ఇక మహిళల లాంగ్‌జంప్‌లో అన్సీ సింగ్ రజతం, 4×400మీ. మిక్స్‌డ్ రిలేలో కాంస్య పతకాలు దక్కాయి. లాంగ్ జంప్ ఫైనల్లో భారత అథ్లెట్ అన్సీ సోజన్ 6.63మీటర్ల దూరం దూకి రెండో స్థానంలో నిలిచి రజత పతకం నెగ్గింది. ఈ విభాగంలో బంగారు పతకం గెలుచుకున్న చైనా అథ్లెట్ క్సియాంగ్ షి కంటే కేవలం 0.10మీటర్లు మాత్రమే అన్సీ వెనుకబడింది. అలాగే హెప్టాథ్లాన్‌లో తెలంగాణ అమ్మాయి నందిని అగసారా కాంస్యం సాధించింది. దీంతో 19వ ఆసియా క్రీడల్లో భారత్ పతకాల సంఖ్య 60కు చేరింది.

4×400మీ.మీటర్ల మిక్స్‌డ్ రిలేలో కాంస్యం

4×400మీ.మిక్స్‌డ్ రిలేలో భారత జట్టు రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. అంతేగాక ఇవాళ స్టీపుల్ చేజ్‌లో భారత్‌కు మూడు పతకాలు వచ్చాయి.



400మీ. హర్డిల్స్‌లో పిటి ఉష రికార్డు సమం..

400మీటర్ల హర్డిల్స్ క్వాలిఫైడ్ రౌండ్స్‌లో విత్య రామ్‌రాజ్ 55.42సెకన్లలో గమ్యానికి చేరి పిటి ఉష రికార్డును సమం చేసింది. 1984లో జరిగిన ఒలింపిక్స్‌లో పిటి ఉష 55.42 సెకన్‌ల టైమింగ్‌తో 400మీటర్ల హర్డిల్స్ రేసు పూర్తి చేసి సరికొత్త రికార్డు నెలకొల్పింది. అప్పటి నుంచి దాదాపు 39ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న ఈ రికార్డును ఇప్పుడు విత్య రామ్‌రాజ్ సమం చేసింది. ఇదే క్రమంలో ఫైనల్స్‌కు విత్య రామ్‌రాజ్ అర్హత సాధించింది.



మహిళల టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో కాంస్యం

మహిళల టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో సుతీర్థ ముఖర్జీ, ఐహిక ముఖర్జీలతో కూడిన ఇండియన్ టీమ్ కాంస్య పతకం సాధించింది. ఆసియా క్రీడల చరిత్రలో మహిళల టీటీ డబుల్స్‌లో భారత్‌కు కాంస్య పతకం రావడం ఇదే తొలిసారి. సోమవారం ఉదయం జరిగిన సెమీఫైనల్‌లో ఉత్తర కొరియాకు చెందిన చా సుయోంగ్, పాక్ సుగ్యోంగ్ జోడి చేతిలో భారత్ పరాజయం పాలై కాంస్యంతో సరిపెట్టుకుంది.

హాకీ సెమీ ఫైనల్స్‌లోకి భారత్
చివరి లీగ్‌లో 12-0 తేడాతో బంగ్లాదేశ్‌పై గెలుపు

పూల్–ఎలో భారత పురుషుల హాకీ జట్టు 12–0తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తుచేసింది. దీంతో పూల్–ఎ నుంచి భారత్ టేబుల్ టాపర్‌గా సెమీఫైనల్స్‌కు చేరింది. ఐదు లీగ్ మ్యాచ్‌లలో భారత్ ఏకంగా 58 గోల్స్ సాధించింది.

పురుషుల క్రికెట్ క్వార్టర్‌ఫైనల్స్...
భారత్ × నేపాల్ (ఉ.6.30గంIIలకు)
పాకిస్తాన్ × హాంకాంగ్(ఉ.11.30గంIIలకు)



ముంబయ్‌కు బయల్దేరిన కోహ్లీ

నెదర్లాండ్స్‌తో టీమిండియా వార్మప్ మ్యాచ్ నేడు

తిరువనంతపురం: నెదర్లాండ్స్‌తో మంగళవారం జరిగే రెండో వార్మప్ మ్యాచ్‌కు ముందు టీమిండియా జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. హఠాత్తుగా అతడు ముంబయికు బయల్దేరి వెళ్లినట్లు సమాచారం. కోహ్లీ జట్టు యాజమాన్యం అనుమతితో ముంబయికు బయల్దేరినట్లు తెలిసింది. ఈ మేరకు బిసిసిఐ అధికారి ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు. కోహ్లీ వ్యక్తిగత అత్యవసర కారణాలతోనే జట్టును వీడినట్లు ఆ అధికారి తెలిపారు. ఇక ఇంగ్లండ్ జరగాల్సిన తొలి వార్మప్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో ఐసిసి వన్డే ప్రపంచకప్‌ముందు భారత్ ఆడుతున్న చివరి వార్మప్ మ్యాచ్ ఇదే. నెదర్లాండ్స్‌తో జరిగే ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌కు కూడా వరుణుడి ముప్పు పొంచి ఉంది. ఇక, ప్రపంచకప్ టోర్నీలో భాగంగా అక్టోబరు 8న టీమిండియా.. ఆస్ట్రేలియాతో తన తొలి మ్యాచ్ ఆడనుంది.

పతకాల పట్టిక

వ.స.	దేశం	స్వ	ర	కా	మొ
1.	చైనా	147	81	42	270
2.	జపాన్	33	44	45	122
3.	ద.కొరియా	31	39	63	133
4.	ఇండియా	13	24	23	60
5.	చైనీస్ తైపీ	12	10	17	39
6.	ఉజ్బెకిస్తాన్	11	14	18	43
7.	థాయ్‌లాండ్	10	7	16	33
8.	ఉ.కొరియా	7	10	5	22
9.	హాంకాంగ్	6	15	23	44
10.	బహ్రైయిన్	6	1	4	11

స్వ:స్వర్ణాలు; ర:రజితం; కా:కాంస్యం మొ:మొత్తం

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68